తెలంగాణ శాసనసభ
దినపత్రికలో
అన్ని రకాల ప్రకటనలు
అడ్వర్టైజ్మెంట్స్ మరియు
వార్తల కోసం
సంప్రదించండి: 9100900931

TELANGANA SHASANA SABHA TELTEL/2016/68867

# తెలంగాణ శాసనసభ

తెలుగు దినపత్రిక

Published from Hyderabad,Rangareddy,Nalgonda,Mahabubnagar, Khammam,


తెలంగాణ | సంపుటి : 02 | సంచిక : 173 | ఎడిటర్ : పోలగోని రాజేష్ | గురువారం 28 నవంబర్ - 2024 | పేజీలు : 8 | వెల : 04/-

## అధికారులు నిద్రపోతున్నారా?

# పిల్లలు చనిపోతే తప్ప స్పందించరా?

### మాగనూర్ ఘటనపై

### తెలంగాణ హైకోర్టు తీవ్ర ఆగ్రహం



- మాగనూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఫుడ్ పాయిజన్
- స్కూల్‌లో ఫుడ్ పాయిజన్ తీవ్రమైన అంశమన్న హైకోర్టు
- అధికారుల నిర్లక్ష్యానికి ఇది నిదర్శనమని మండిపాటు
- వారం రోజుల్లో కౌంటర్ దాఖలు చేస్తామన్న ప్రభుత్వ న్యాయవాదిపైనా ఆగ్రహం

3వ పేజీలో

## ప్రధాని మోదీని కలిసిన

### తెలంగాణ బీజేపీ ఎంపీలు,ఎమ్మెల్యేలు



- మోదీని కలిసిన వారిలో కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్
- మోదీతో కాసేపు ముచ్చటించిన ప్రజాప్రతినిధులు
- రాజాసింగ్ భుజం తట్టిన ప్రధాని మోదీ

3వ పేజీలో

### నవంబర్ 30 నుంచి డిసెంబర్ 7 వరకు

## బీఆర్ఎస్ 'గురుకుల బాట'



- గురుకులాలు,కేజీబీవీ,మోడల్ స్కూల్స్, కాలేజీలను పరిశీలించనున్న బీఆర్ఎస్
- గురుకుల,పాఠశాల విద్యను రేవంత్ సర్కార్ సంక్షోభంలోకి నెట్టిందని విమర్శ
- సీఎం ఢిల్లీకి తిరిగేందుకే సమయం సరిపోవడం లేదని ఎద్దేవా
- ఆర్ఎస్ ప్రవీణ్ నేతృత్వంలో అధ్యయన కమిటీ వేస్తున్నట్లు వెల్లడి

3వ పేజీలో

శాసనసభ / హైదరాబాద్ : నవంబర్ 30 నుంచి డిసెంబర్ 7 వరకు రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ గురుకుల బాట కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెల్లడించారు.గురుకుల బాట కార్యక్రమంలో భాగంగా గురుకులాలు,కేజీబీవీలు,మోడల్ స్కూల్స్,ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలు, కాలేజీలను బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు,ఎంపీలు, ఎమ్మెల్సీలు,పార్టీ సీనియర్ నాయకులు పరిశీలిస్తారు.

## ప్రశ్నిస్తే నీ డీఎన్ఏ

### ఏమిటని మాట్లాడుతున్నారు

- ఏడాది పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం సాధించింది ఏమీ లేదన్న కిషన్ రెడ్డి
- తన డీఎన్ఏ బీజేపీ అని వ్యాఖ్య
- రాష్ట్రంలో రాజకీయ వ్యవస్థ భ్రష్టుపడుతోందని ఆవేదన

3లో



శాసనసభ / హైదరాబాద్ : తెలంగాణలో ఏడాది పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం సాధించింది ఏమీ లేదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. బెదిరింపులు, తిట్ల పురాణాలు తప్ప ఏమీ సాధించలేదని అన్నారు. సమస్యలపై మాట్లాడితే నీ డీఎన్ఏ ఏమిటని మాట్లాడుతున్నారని... తన డీఎన్ఏ భారతీయ జనతా పార్టీ అని చెప్పారు. మిగిలిన వారి మాదిరి 10 పార్టీలు మారిన డీఎన్ఏ తనది కాదని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను డిసెంబర్ 1 నుంచి 5 వరకు ప్రజలకు వివరిస్తామని తెలిపారు. రాజకీయ పార్టీల ఆరోపణలు, ప్రత్యారోపణలతో రాష్ట్రం నష్టపోతుందని చెప్పారు.

## అదానీని ఎందుకు

## అరెస్ట్ చేయడం లేదు?

- అదానీ జైల్లో ఉండాలన్న రాహుల్ గాంధీ
- కేంద్రంలోని కొందరు పెద్దలు అదానీని కాపాడుతున్నారని విమర్శ
- లంచాల ఆరోపణలను అదానీ ఒప్పుకోరని వ్యాఖ్య



3లో

## కాంగ్రెస్ నేతల మధ్య

## ఎలాంటి విభేదాల్లేవు

- మంత్రివర్గ విస్తరణ విషయమై పార్టీ అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుందని వెల్లడి
- ప్రతిపక్షాల పసలేని విమర్శలతో ఎలాంటి ప్రయోజనం లేదని వ్యాఖ్య
- మూసీ నిర్వాసితులు వ్యాపారం చేసుకోవడానికి రుణ సదుపాయం కల్పిస్తామని హామీ




మిగతా »»3లో

# సర్వే చేసి సరిహద్దులు గుర్తించే వరకు

# నిర్మాణాలు వద్దు : హైడ్రా కమిషనర్

- మాదాపూర్‌లోని ఈదులకుంట చెరువును పరిశీలించిన హైడ్రా కమిషనర్
- చెరువు శిఖాన్ని పూడ్చేసి నిర్మాణాలు చేపట్టినట్లు గుర్తించిన రంగనాథ్
- చెరువులోకి నీరు వచ్చే నాలాను దారి మళ్లించినట్లు గుర్తించిన కమిషనర్




శాసనసభ / హైదరాబాద్ : ఈదులకుంటను సర్వే చేసి సరిహద్దులు గుర్తించే వరకు ఎలాంటి నిర్మాణాలు చేపట్టకుండా చూడాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఈరోజు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మాదాపూర్‌లోని ఈదులకుంట చెరువును ఆయన పరిశీలించారు. ఖానామెట్ గ్రామంలో 6.5 గుంటల విస్తీర్ణంలో ఉన్న ఈ చెరువు శిఖాన్ని పూడ్చేసి కొంతమంది బిల్డర్లు నిర్మాణాలు చేపడుతున్నట్లు గుర్తించారు.

మిగతా »»3లో

## కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో

## మంత్రి పొన్నం ప్రభాకర్ భేటీ



3లో


### అప్పటి వరకు హైదరాబాద్

## చెరువుల పరిరక్షణ మాదే:

## హైకోర్టు కీలక వ్యాఖ్యలు

- ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లను నిర్ధారించే వరకు పర్యవేక్షణ తమదేనన్న హైకోర్టు
- ఇప్పటి వరకు పలు చెరువులకు నోటిఫికేషన్లు జారీ చేశామన్న హెచ్‌ఎండీఏ
- తదుపరి విచారణ డిసెంబర్ 30కి వాయిదా వేసిన హైకోర్టు

3



## సీఎం పదవి...ఏక్‌నాథ్ షిండే వ్యాఖ్యలపై

## స్పందించిన దేవేంద్ర ఫడ్నవీస్

- సీఎం ఎంపిక విషయంలో మోదీ, అమిత్ షా నిర్ణయానికి కట్టుబడి ఉంటామన్న షిండే
- షిండే ప్రకటన చాలామంది సందేహాలను నివృత్తి చేసిందన్న దేవేంద్ర ఫడ్నవీస్
- త్వరలో నేతలను కలిసి నిర్ణయం తీసుకుంటామని వెల్లడి



మిగతా »»3లో

### రైతులను దగా చేసినందుకు

## పండుగ చేస్తున్నావా..

### రేవంత్ రెడ్డిని నిలదీసిన హరీశ్‌రావు

3



## భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందాం

### డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తిరుపతి



**శాసనసభ/ఆత్మకూర్ :** భారత రాజ్యాంగం 75 ఏండ్ల దినోత్సవం సందర్భంగా భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) ఆధ్వర్యంలో ఆత్మకూర్ మండల కేంద్రంలోని బీసీ హాస్టల్ లో భారత రాజ్యాంగ పీఠిక ను చదువుతూ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడారు. ప్రజలకు స్వేచ్ఛ, సమానత్వం అందిస్తూ రూపొందించిన రాజ్యాంగాన్ని దేశ పౌరులందరూ గౌరవించాలని, పౌరులకు ప్రాథమిక హక్కులు కల్పిస్తూ సమాజంలో అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం రిజర్వేషన్లను పొందపరుస్తూ, వెనుక బడిన వర్గాల అభ్యున్నతి కోసం అంబేద్కర్ ఎంతగానో కృషి చేశారని, కానీ నేటి పాలకులు రాజ్యాంగంలో పొందపరిచిన హక్కులను అణిచివేసే ప్రయత్నం చేస్తున్నారని, రిజర్వేషన్లను తొలగించే కుట్ర చేస్తున్నారని,భారత రాజ్యాంగాన్ని రక్షించుకుంటేనే దేశంలో అణగారిన వర్గాల అభివృద్ధి జరుగుతుందని , భారత రాజ్యాంగాన్ని రక్షించుకోవలసిన బాధ్యత అందరి మీద ఉందని అన్నారు.ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఓర్సు చిరంజీవి, నాయకులు లక్ష్మీ తేజ, శ్రీకాంత్, రాజేష్, అనీల్, నవీన్, చంటి, శివ, మహేందర్ లు పాల్గొన్నారు.

## జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన లారీ.









**శాసనసభ / ములుగు :** వనం రాజు తండ్రి పేరు సమ్మయ్య గ్రామము గోరి కొత్త పల్లి అగు యువకుడు ద్విచక్ర వాహనం పై పని నిమిత్తం ములుగు కు పోవుచుండగా గట్టమ్మ దేవాలయం సమీపంలో జాతీయ రహదారి 163 పై వెనక నుండి లారి ఢీ కొట్టి ముందు టైరు రాజు మీదకు దూసుకెల్లగా అక్కడికక్కడే మృతి చెందాడు . మృతునికి ఒక పాప,ఒక బాబు .లారి డ్రైవర్ తాగి యున్నాడని స్థానికంగా యున్న వారు తెలియ పరిచారు.లారి డ్రైవర్ పరారి అయినట్లు సమాచారం అందుకున్న బందువులు రోడ్డుపై బైఠాయించగా సి ఐ హామీతో మృతిని బందువులు శాంతి చారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు.

## అథ్లెటిక్స్ లో విద్యార్థుల ప్రతిభ



**శాసనసభ/దామెర:** హనుమకొండలోని జెఎన్ఎస్ మైదానంలో జిల్లా స్థాయిలో సబ్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్స్ పోటిలను ఈ నెల 26వ తేదిన నిర్వహించారు.ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా దామెర మండలం ఓగ్లాపూర్ ఎస్బిఐటి కళాశాల ఆవరణలోని మహాత్మా జ్యోతిరావు పూలే బాలురు (సంగెం) పాఠశాలకు చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు.ఈ క్రీడా పోటీల్లో అండర్ 8,10,12, విభాగాల్లో సిహెచ్ గౌతమ్,మనిదిప్, సుశాంత్,హర్షిత్,సిద్ధార్థ,రాకేష్,వర్షిత్,నందు,వరుణ్ తేజ్,దక్షయ్,శ్రీవర్ధన్,అక్షిత్, సుజిత్,లు 30 బహుమతులతో ఉత్తమ పతకాలు సాధించారు.ఈ నేపథ్యంలో బుధవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రీన్సిపాల్ ఎస్. యాదగిరి విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అశోక్, రేణుక,రజిత, శ్రీకాంత్, శ్రీనాథ్, విద్యార్థులు పాల్గొన్నారు.

## మందకృష్ణ మాదిగ వర్గీకరణ ఆలోచన మానుకో

### రిజర్వేషన్ పెంచుకో పెంచుకొనుటకు పోరాడుదాం

### మాల ఉద్యోగ సంఘం రాష్ట్ర నాయకుడు వంగేటి రాజమౌళి



**శాసనసభ / ఆత్మకూర్ :** ఆత్మకూరు మండల కేంద్రంలోని నీరుకుల్లా గ్రామంలో ఈరోజున ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి గోడ పత్రికను మాల ఉద్యోగ సంఘం రాష్ట్ర నాయకుడు వంగేటి రాజమౌళి ఆవిష్కరించారు అనంతరం మాట్లాడుతూ వర్గీకరణ పేరుతో దళితుల మధ్యలో చిచ్చు పెడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకుడు మందకృష్ణ మాదిగ వర్గీకరణ ఆలోచన మానుకోవాలని ఆయన పిలుపునిచ్చారు దళితుల రిజర్వేషన్ పెంచుకోనుటకు అందరం కలిసి పోరాటం చేయాలని దళిత సంఘాల్లో వర్గీకరణ పేరుతో విడగొట్టడం సరికాదన్నారు దళితులు కలిసి ఉంటేనే దళిత జాతి అభివృద్ధి చెందుతుంది అన్నారు దళితులంటే మాదిగల కాదు మాలలు అన్న విషయాన్ని కృష్ణ మాది గుర్తుంచుకోవాలన్నారు తెలంగాణ రాష్ట్రంలో అన్ని రంగాల్లో మాదిగల కంటే మాలలు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని తెలిపారు ఈ కార్యక్రమంలో ఆత్మకూరు మండల కన్వీనర్ పసుల లక్ష్మీనారాయణ, మాల సంఘం సీనియర్ నాయకులు వంగేటి రవికుమార్, నేతకాని సారంగం, వంగేటి లక్ష్మణ్ ,న్యాతకాని పైడి, శంకర్ లింగం, సారయ్య, తుప్పరి ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

## విజ్ఞాన సృష్టికి వేదికగా మారిన సైన్స్ ఫేయిర్.

**వేలాదిగా తరలివచ్చిన విద్యార్థులు**
**రేపటి ముగింపు కార్యక్రమానికి హాజరుకానున్న మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు**
**ఉల్లాసంగా, ఉత్సాహంగా సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ.**



**శాసనసభ/నర్సంపేట :** నర్సంపేట మండలం మహేశ్వరం శివాని పబ్లిక్ స్కూల్ ప్రాంగణంలో జరుగుతున్న సైన్స్ ఫెయిర్ రెండవ రోజు కూడా విద్యార్థుల ఉత్సాహం, సృజనాత్మకత, విజ్ఞాన పరంపరకు అద్దం పట్టింది. విద్యార్థులు తమ ప్రాజెక్టులను ప్రదర్శించి, తమ శాస్త్రీయ నైపుణ్యాలను ఆవిష్కరించారు.సైన్స్ ఫెయిర్ రెండవ రోజు దాదాపు 92 పాఠశాలల నుండి 3,000 మందికి పైగా విద్యార్థులు, ఉపాధ్యాయులు సందర్శించినట్లు వరంగల్ జిల్లా విద్యాశాఖ అధికారి మామిడి జ్ఞానేశ్వర్, జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ కట్ల శ్రీనివాస్ తెలిపారు.విజ్ఞాన సృష్టికి వేదికగా మారిన సైన్స్ ఫెయిర్ ఉత్సాహం మరియు ఉల్లాసం నిండిన వాతావరణంలో కొనసాగింది. విద్యార్థుల నైపుణ్యాలు, పరిశోధనాత్మక ఆలోచనలు, కొత్త ఆవిష్కరణలతో సైన్స్ ఫెయిర్‌కు ప్రత్యేక ఆకర్షణను తెచ్చాయి.ప్రాజెక్టులకు తోడు విద్యార్థులు సైన్స్ అంశాల ఆధారంగా కళా ప్రదర్శనలు, సైంటిఫిక్ స్కిట్స్ కూడా ప్రదర్శించారు, ఇది కార్యక్రమానికి మరింత ఉల్లాసాన్ని తీసుకువచ్చింది.సాంస్కృతిక కమిటీ కన్వీనర్ తేజావత్ జయ ఆధ్వర్యంలో విద్యార్థులు ఎంతో ఉల్లాసంగా ప్రదర్శనలు ఇచ్చారు.ప్రాజెక్ట్ సమాజానికి ఉపయోగకరమా? ఆవిష్కరణ ప్రజలకు తక్కువ ఖర్చుతో అందుబాటులో ఉండగలదా?దీర్ఘకాలిక ప్రయోజనాలు ఉన్నాయా? మున్నగు అంశాలను పరిశీలించి జడ్జిలు మార్కులను కేటాయించి ఉత్తమమైన వాటిని ఎంపిక చేస్తారని తెలిపారు.ఈరోజు మధ్యాహ్నం సుస్థిర భవిష్యత్తు మరియు ఆరోగ్యం కోసం మిల్లెట్లు అనే అంశం పైన సెమినార్ నిర్వహించారు.ఇందులో వివిధ పాఠశాలల నుండి విద్యార్థులు పాల్గొన్నారు. కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ మరియు ఎన్సీఈఆర్టీ ఆధ్వర్యంలో ఇన్స్పైర్ పోటీలలో 148 ప్రాజెక్టులు విద్యార్థులు ప్రదర్శించారని,2025 సంవత్సరము జనవరిలో జరగబోవు 52వ రాష్ట్రీయ బాల వైజ్ఞానిక ప్రదర్శన సుస్థిర భవిష్యత్తు కోసం శాస్త్ర సాంకేతికత ప్రధాన అంశంగా ఏడు ఉప అంశాలలో విద్యార్థులు 352ఎగ్జిబిట్లను ప్రదర్శించారని తెలిపారు.1. ఆహారం ఆరోగ్యం మరియు పరిశుభ్రత 56 ఎగ్జిబిట్లు.2. రవాణా మరియు సమాచార ప్రసారం 54 ఎగ్జిబిట్లు

3. సహజ వ్యవసాయం 38
4. విపత్తు నిర్వహణ 47ఎగ్జిబిట్లు



5.గణితనమున మరియు గణన ఆలోచన 37ఎగ్జిబిట్లు
6 వ్యర్థాల నిర్వహణ 53ఎగ్జిబిట్లు
7 వనరుల నిర్వహణ 67 ఎగ్జిబిట్లు ప్రదర్శించారు .

వీటిలో 6 నుండి 8వ తరగతి విద్యార్థులు జూనియర్ విభాగంలో 9 నుండి 12వ తరగతి విద్యార్థులు సీనియర్ విభాగంలో తమ ఎగ్జిబిట్ లను ప్రదర్శించారన్నారు.రేపు జరిగే ముగింపు కార్యక్రమం లో గౌరవ మంత్రులు ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు అధికారులు పాల్గొంటారని, ఉదయం పూట సందర్శకులు వీక్షించవచ్చని, మధ్యాహ్నం నుండి ముగింపు సమావేశాలు ప్రారంభమవుతాయని జిల్లా విద్యాశాఖ అధికారి మామిడి జ్ఞానేశ్వర్, జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ కట్ల శ్రీనివాస్ తెలిపారు.ఈరోజు సైన్స్ ఫెయిర్ కార్యక్రమాలలో నర్సంపేట ఎంఈఓ కొర్ర సారయ్య, సైన్స్ ఫెయిర్ నిర్వహణ కమిటీ సభ్యులు పట్టాభి,శివాని పబ్లిక్ స్కూల్ చైర్మన్ వేములపల్లి సుబ్బారావు, శివాని పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ రాహుల్ వర్మ , ప్రెస్ అండ్ పబ్లిసిటీ కమిటీ కన్వీనర్ ఎల్. సుధాకర్ రావు, కో కన్వీనర్ పిన్నింటి బాలాజీ రావు,సైన్స్ ఫెయిర్ వివిధ కమిటీల కన్వీనర్లు లక్ష్మయ్య, పాపమ్మ ,అనిత,రంగారావు, పట్టాభి, జయ, మంగ్య, బిక్షపతి,రామచంద్ర రావు,జ్యోతిలక్ష్మి, రమేష్ బాబు, రామస్వామి, శ్రీనివాస్, వెంకట్రాం నరసయ్య, రామచంద్రు, జ్యోతిర్మయి, పరమేశ్వర్, స్వరూప, అబ్దుల్ రజాక్,పరమేశ్వర్ సైన్స్ ఫెయిర్ వివిధ కమిటీల కోకన్వీనర్ లు రాంగోపాల్ రెడ్డి, వి కృష్ణమూర్తి,శ్రవణ్, సురేష్ బాబు,కిరణ్, కృష్ణ, పరమేశ్వర్, రవీంద్రనాథ్ అజీజ్, భాస్కర్, సోమలక్ష్మి, శ్రీనివాసులు శ్రీనివాస్, సురేందర్, రఘువీర్, మల్లయ్య,ప్రవీణ్ కుమార్,సుమలత, వేణుగోపాలరావు, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలను నిర్మూలించాలి



**శాసనసభ/దామెర:** బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తహసిల్దార్ జ్యోతి వరలక్ష్మి దేవి అన్నారు.మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో బుధవారం ఎన్ జివోబి జ్ఞానేశ్వరి ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన సదస్సును నిర్వహించారు.ఈ సందర్భంగా తహసిల్దార్ జ్యోతి వరలక్ష్మి దేవి మాట్లాడుతూ.. మైనర్లకు వివాహం చేయడం చట్ట రిత్యా నేరమన్నారు. బాల్య వివాహాలను అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉండాలని తెలిపారు. అంతకుముందు ల్యాదెళ్ల గ్రామంలోని పాఠశాలలో ఆమె మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ మంజుల, ఐసిడిఎస్ సెక్టార్ సూపర్వైజర్ రాణి, గిర్దావర్ సంపత్ రావు, పంచాయతీ సెక్రెటరీ మనోహర్ రెడ్డి, అంగన్వాడి టీచర్లు, ఉపాధ్యాయులు, ఆశా వర్కర్లు, పాల్గొన్నారు.

## బిసి వెల్ఫేర్ స్కూల్ ను తనిఖీ చేసిన స్థానిక ఎమ్మార్వో..



**శాసనసభ/ శాయంపేట :** మండలంలోని మహాత్మ జ్యోతిబాపూలే తెలంగాణ (BC) వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ (బాలుర) ను స్థానిక తహసిల్దార్ కాలువల సత్యనారాయణ కలెక్టర్ ఆదేశాల మేరకు ఆకస్మికంగా తనిఖీ చేశారు .స్కూల్ ప్రిన్సిపాల్ అయిన శ్రీమతి రేవతి మరియు అధ్యాపకులు విద్యార్థుల ముందు స్కూల్లోని వంట గదిని పిల్లలు స్నానాలు చేసే ప్రదేశాన్ని వారికి రోజు పెట్టే భోజన వసతిని గురించి పూర్తి వివరాలు అడిగి తెలుసుకోవడం జరిగినది అని తెలిపారు. మరియు భోజన వివరాలను విద్యార్థులను అడిగి తెలుసుకోగా విద్యార్థులు మాకు భోజనం మంచిగానే ఉన్నాయని తెలిపారు. సాయంత్రం స్కూల్లో గ్రౌండ్ నందు చీకటిగా ఉందని సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయవలసినదిగా ఎమ్మార్వో గారికి విద్యార్థులు తెలిపారు .చదువు విషయంలో విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి విద్యార్థులకు ఎమ్మార్వో పలు సూచనలు ఇచ్చారు . ఇట్టి తనిఖీ లో ఎమ్మార్వో కార్యాలయ సిబ్బంది నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## యువత సన్మార్గంలో నడవాలి

### ఏసీపి కిషోర్ కుమార్



**శాసనసభ/దామెర :** సమాజంలోని యువత సన్మార్గంలో నడవాలని పరకాల ఏసీపి కిషోర్ కుమార్ తెలిపారు. మండల పరిధిలోని పులుకుర్తి టీబీసీ చర్చిలో యూత్ మెగాఫెస్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పరకాల ఏసిపి కిషోర్ కుమార్ హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువత అనవసరమైన వివాదాల్లో చిక్కుకొని తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, ప్రతి ఒక్కరూ సమాజంపై అవగాహన కలిగి ఏదో ఒక రంగంలో రాణించాలని పేర్కొన్నారు.ఆనంతరం సంఘ పెద్దలు యువనస్తులు ఏసిపి ఎస్సై లను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై కొంక అశోక్, మాజీ ఉప సర్పంచ్ పెంచాల రాజేందర్, సంఘ కాపరి జాన్సన్, కారోబార్ ఆనంద్, సంఘ పెద్దలు గోవింద్, అర్జున్, గోవింద్ దయాకర్, గోవింద్ సుగుణాకర్, గోవింద్ సుధాకర్, గోవింద్ రమేష్, యువనస్తులు సిద్ధార్థ,రాకేష్,చంటి, మహిపాల్, వికాస్, తదితరులు పాల్గొన్నారు.

## వేల సంఖ్యలో బైక్లతో భారీ ర్యాలీని నిర్వహించనున్నాం

**శాసనసభ / హైదరాబాద్ :** తెలంగాణ భవన్లో ఈ నెల 29వ తేదీన నిర్వహించే దీక్షా దివస్ కార్యక్రమానికి సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వేల సంఖ్యలో బైక్లతో భారీ ర్యాలీని నిర్వహించనున్నట్లు సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుల్ల పద్మారావు గౌడ్ బుధవారం తెలిపారు.సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్ఎస్ కార్పొరేటర్లు, ముఖ్య నేతలతో సీతాఫాల్మండీలో అత్యవసర సమావేశం నిర్వహించారు.సుమారు 3 వేల బైక్ లతో ర్యాలీ గా బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ సర్కిల్ వద్దకు చేరుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. అక్కడి నుండి ర్యాలీగా తెలంగాణ భవన్ కు చేరుకొని అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొనాలని తెలిపారు. తెలంగాణ భవన్ లో జరిగే దీక్షా దివస్ లో రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల నుండి పార్టీ శ్రేణులు పాల్గొంటారని చెప్పారు.

శాసనసభ
తెలుగు దినపత్రిక
గురువారం 28 నవంబర్ - 2024

# సింగూరు, మంజీరాలకు గోదావరి జలాలు



**శాసనసభ/ హైదరాబాద్ :** జలసౌధలో ఉమ్మడి మెదక్ జిల్లా నీటిపారుదల ప్రాజెక్ట్‌లు, ఎత్తిపోతల పథకాలపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు.సింగూరు, మంజీరాలకు గోదావరి జలాలు రానున్నాయని..మహానగరానికి మంచినీటితో పాటు సేద్యంలోకి కొత్త ఆయకట్టు రానుందన్నారు. అదే తరహాలో నిజాంసాగర్‌కు గోదావరి జలాలు వస్తాయన్నారు. సింగూరు ప్రాజెక్ట్‌లో పూడిక తీతకు సన్నద్ధంగా ఉన్నట్లు.. తద్వారా నీటి సామర్థ్యం పెంపుకు చర్యలు చేపడుతున్నామన్నారు. పూడిక తీతతో మహానగరానికి మంచినీటి సమస్యలు తీరనున్నాయన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పూడిక తీతకు నిర్ణయం తీసుకున్నామన్నారు.కాలువల లైనింగ్‌కు టెండర్ల ప్రక్రియ మొదలు పెట్టాలని అధికారులను ఆదేశించారు. బసమేశ్వర, సంఘమేశ్వర, ఎత్తిపోతల పథకాలు సత్వరమే పూర్తికి ఆదేశాలు జారీ చేశారు. పెద్దారెడ్డిపల్లి ఎత్తిపోతల పథకానికి ప్రతిపాదనలు సిద్ధం చెయ్యాలన్నారు. అర్ధాంతరంగా ఆగిపోయిన ప్యాకేజీ 19ఏ పనులు పునరుద్ధరణకు నిర్ణయం తీసుకున్నామన్నారు. ప్యాకేజీలు 17,18,19 పనులను వేగవంతం చెయ్యాలన్నారు. 38 మైనర్ ఇరిగేషన్ ట్యాంకులకు మరమ్మతులు చేస్తామన్నారు. నల్లవాగు మీడియం ప్రాజెక్ట్ కెనాల్‌కు మరమ్మతులు చేపడతామన్నారు. కారముంగి ఎత్తిపోతల పథకానికి గ్రీన్ సిగ్నల్ వచ్చిందన్నారు.

# రైతులకు గుడ్ న్యూస్.. పాలమూరు సభ ద్వారా రూ.3వేల కోట్ల రుణమాఫీ!



**శాసనసభ/ హైదరాబాద్ :** దేశంలో ఎక్కడా లేని విధంగా 18 వేల కోట్లు రైతుకు రుణమాఫీ చేశామని మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు పేర్కొన్నారు. పాలమూరు సభ ద్వారా మరో రూ.3 వేల కోట్లు ఇవ్వబోతున్నామన్నారు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్‌లో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు మాట్లాడారు. షాద్ నగర్ మార్కెట్‌లో కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటుకు మంత్రి హామీ ఇచ్చారు. కొందుర్గు మండలానికి నూతన వ్యవసాయ మార్కెట్ కమిటీ ఏర్పాటుకు అంగీకారం తెలిపారు.షాద్ నగర్ నియోజకవర్గానికి పూర్తి సహకారం అందిస్తామన్నారు. ఆర్ఆర్ఆర్(రీజినల్ రింగ్ రోడ్) వస్తే షాద్ నగర్ భూములు బంగారమే అని మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు పేర్కొన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా 22 లక్షల మంది రైతులకు 18 వేల కోట్లు రుణమాఫీ చేశామన్నారు. త్వరలో పాలమూరు జిల్లాల్లో జరిగే రైతు పండుగను పురస్కరించుకొని వివిధ కారణాల చేత రుణమాఫీ అందని రైతాంగానికి 3,000 కోట్ల రూపాయలను పంపిణీ చేయబోతున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు పేర్కొన్నారు. మహబూబ్ నగర్‌లో 30న రైతు సభ నిర్వహించబోతున్నామని తెలిపారు.

# అదానీని ఎందుకు అరెస్ట్ చేయడం లేదు?: రాహుల్ గాంధీ

సోలార్ విద్యుత్ కాంట్రాక్టుల కోసం దేశంలోని వివిధ రాజకీయ నాయకులు, అధికారులకు అదానీ గ్రూప్ రూ. 2,200 కోట్ల లంచం ఇచ్చిందనే అభియోగాలు కలకలం రేపుతున్నాయి. పార్లమెంట్ ఉభయ సభలను కూడా అదానీ అంశం కుదిపేస్తోంది. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ లోక్ సభలో మాట్లాడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. కేంద్ర ప్రభుత్వంలోని కొందరు పెద్దలు అదానీని కాపాడుతున్నారని... అదానీని వెంటనే అరెస్ట్ చేయాలని రాహుల్ డిమాండ్ చేశారు. చిన్న విషయాలకే వందలాది మందిని అరెస్ట్ చేస్తున్నారని... అదానీని ఎందుకు అరెస్ట్ చేయడం లేదని ప్రశ్నించారు. అదానీ జైల్లో ఉండాలని అన్నారు. తనపై వచ్చిన లంచాల ఆరోపణలను అదానీ ముమ్మాటికీ ఒప్పుకోరని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా బీజేపీ ఎంపీ మహేశ్ జెఠ్మలానీ మాట్లాడుతూ... రాజకీయ లబ్ధి కోసం అదానీ వ్యవహారాన్ని కాంగ్రెస్ రాద్ధాంతం చేస్తోందని విమర్శించారు. అమెరికా న్యాయస్థానంలో వచ్చిన ఆరోపణలను గుడ్డిగా అనుసరించడం సరికాదని అన్నారు.

# అప్పటి వరకు హైదరాబాద్ చెరువుల పరిరక్షణ మాదే: హైకోర్టు కీలక వ్యాఖ్యలు

హెచ్ఎండీఏ పరిధిలోని చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లను నిర్ధారించే వరకు హైదరాబాద్‌లోని చెరువుల పర్యవేక్షణ బాధ్యత తమదేనని తెలంగాణ హైకోర్టు స్పషం చేసింది. నగరంలోని అన్ని చెరువుల పర్యవేక్షణ తమదేనని తెలిపింది. రామమ్మ చెరువు బఫర్ జోన్‌లో నిర్మాణాలు జరగకుండా చూడాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై ఈరోజు హైకోర్టులో విచారణ జరిగింది.మరోవైపు, హెచ్ఎండీఏ పరిధిలో 3,532 చెరువులు ఉన్నాయని గత జులైలో విచారణ సందర్భంగా ప్రభుత్వం తెలిపింది. వాటికి బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్‌ను నిర్ధారించాలని హైకోర్టు ఆదేశించింది.ఈరోజు రామమ్మ చెరువు బఫర్ జోన్‌పై విచారణ సందర్భంగా హెచ్ఎండీఏ కమిషనర్ విచారణకు హాజరయ్యారు. ఇప్పటి వరకు 2,793 చెరువులకు ప్రాథమిక నోటిఫికేషన్లు జారీ చేశామని, 530 చెరువులకు తుది నోటిఫికేషన్లు జారీ అయ్యాయని తెలిపారు. తదుపరి విచారణను డిసెంబర్ 30కి వాయిదా వేసింది. ఆ లోగా నివేదిక ఇవ్వాలని ఆదేశించింది.

# సీఎం పదవి... ఏక్‌నాథ్ షిండే వ్యాఖ్యలపై స్పందించిన దేవేంద్ర ఫడ్నవీస్

ముఖ్యమంత్రి రేసులో ప్రధానంగా ఫడ్నవీస్ పేరు వినిపిస్తోంది. సీఎం ఎంపిక విషయంలో ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలదే తుది నిర్ణయమని, వారు తీసుకునే నిర్ణయానికి కట్టుబడి ఉంటామని మహారాష్ట్ర ఆపద్ధర్మ ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే అన్నారు. ఈ వ్యాఖ్యలపై ఫడ్నవీస్ స్పందించారు.మహాయుతి కూటమిలో ఎప్పుడూ ఒకరిపై మరొకరికి భిన్నాభిప్రాయాలు లేవని, ఏ విషయంలో అయినా తాము కలిసి కూర్చొని నిర్ణయాలు తీసుకున్నామన్నారు.తాము కలిసే నిర్ణయాలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి పదవి విషయంలోనూ అది వర్తిస్తుందని అభిప్రాయపడ్డారు. కొంతమందిలో కొన్ని అనుమానాలు ఉన్నాయని, ఈరోజు షిండే వ్యాఖ్యలతో వారికి అర్థమై ఉంటుందన్నారు. త్వరలో తాము పార్టీ అగ్రనేతలను కలిసి నిర్ణయం (సీఎం పదవిపై) తీసుకుంటామన్నారు.మహారాష్ట్ర సీఎం పదవికి ఏక్ నాథ్ షిండే ఇప్పటికే రాజీనామా చేశారు.

# ప్రజా ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం కట్టుబడి పనిచేస్తోంది..



**శాసనసభ/ హైదరాబాద్ :** తోటి మనుషులను ప్రేమించాలని, కష్టాల్లో ఉన్న వారిని ఆదుకోవాలి పేదలకు చేయూతను అందించి పైకి తీసుకురావాలి.. సంఘంతో జీవించాలి అన్న క్రీస్తు బోధనలకు అనుగుణంగా ఇందిరమ్మ రాజ్యంలోని ప్రజా ప్రభుత్వం కష్టాల్లో ఉన్న వారిని ఆదుకుంటూ, పేదలకు చేయూతనిస్తూ అభివృద్ధిలోకి తీసుకొస్తుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు.హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో జరిగిన క్రైస్తవ ప్రతినిధుల సభలో ఆయన మాట్లాడారు. ఇందిరమ్మ రాజ్యంలో ఏర్పడిన ప్రజా ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం కట్టుబడి పని చేస్తోందన్నారు. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్న వాటిని అధిగమిస్తూ ప్రజల అభివృద్ధికి కావలసిన ప్రణాళికలను రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రులం సమిష్టిగా తయారు చేసి అన్ని వర్గాల ప్రజలను అభివృద్ధిలోకి తీసుకురావడానికి ముందుకు వెళు న్నామన్నారు.

**రాష్ట్ర వ్యాప్తంగా 95 శాతం సర్వే పూర్తి**

విద్య, వైద్యానికి ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రాష్ట్రంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు నిర్మాణం చేసి అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను పేదలకు ఉచితంగా అందించే కార్యక్రమాన్ని ముందుకు తీసుకు వెళుతున్నామన్నారు. ఇండ్లు లేని పేదలకు 5 లక్షల రూపాయలు ఇచ్చి ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణం చేయాలని దీపావళి నుంచి మొదలుపెట్టామన్నారు.సమాజంలో సగభాగం ఉన్న మహిళలను మహాలక్ష్మిగా గౌరవిస్తూ ప్రజా ప్రభుత్వం వారికి ఉచితంగా ఆర్టీసీ బస్సు రవాణా సౌకర్యాన్ని కల్పిస్తుందన్నారు. రాష్ట్రంలో మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్న రవాణా డబ్బులను వారి తరఫున ఆర్టీసీకి ప్రతినెల ప్రజా ప్రభుత్వం 400 కోట్ల రూపాయలు చెల్లిస్తుందన్నారు.సింగూరు, మంజీరాలకు గోదావరి జలాలు

**ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలో భాగంగా** గృహ జ్యోతి పథకాన్ని తీసుకువచ్చి 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్తును పేదలకు అందిస్తున్నామ న్నారు. రాష్ట్రంలో వ్యవసాయదారులకు అందిస్తున్న ఉచిత విద్యుత్తుకు నెలకు రూ.1000 కోట్లు ప్రభుత్వం విద్యుత్ సంస్థలకు చెల్లిస్తుందన్నారు. నిరుద్యోగ యువత యువకులకు ఉద్యోగాలు కల్పించడానికి టీజీపీఎస్సీని ప్రక్షాళన చేసి ,జాబ్ క్యాలెండర్ ప్రకటించి, ఇప్పటి వరకు 55 వేల మందికి ఉద్యోగాలు ఇచ్చామన్నారు. 500 రూపాయలకే మహిళలకు గ్యాస్ సిలిండర్‌ను అందిస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఆహార ధాన్యాలు ఉత్పత్తి పెంచడానికి, రైతులను ప్రోత్సహించడానికి, కేవలం 15 రోజుల్లోనే రెండు లక్షల రుణాలు ఉన్న రైతులందరికీ 18 వేల కోట్ల రూపాయలు వారి ఖాతాల్లో జమ చేసి రుణమాఫీ చేశామన్నారు.కష్టాల్లో, ఇబ్బందుల్లో ఉన్న వారిని ఆదుకోవాలన్న క్రీస్తు మార్గం అనుసరిస్తూ ఇందిరమ్మ రాజ్యంలోని ప్రజా ప్రభుత్వం ముందుకుపోతుందన్నారు. మహిళలను ఆర్థికంగా ప్రోత్సహించడానికి ఏడాదికి 20వేల కోట్ల రూపాయలు వడ్డీ లేని రుణాలు ఇస్తున్నాం. ఐదు సంవత్సరాలలో లక్ష కోట్ల రుణాలు ఇప్పిస్తామని ఉపముఖ్యమంత్రి పేర్కొన్నారు. అభివృద్ధిలో అందరినీ భాగస్వామ్యం చేయడానికి సమాజ హితం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.

( మొదటి పేజీ తరువాయి )

# సర్వే చేసి సరిహద్దులు గుర్తించే వరకు నిర్మాణాలు వద్దు

తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి అనుమతులు తీసుకున్నట్లు హైడ్రా కమిషనర్ గుర్తించారు. అక్రమంగా తీసుకున్న అనుమతులతోనే నిర్మాణాలు చేపట్టినట్లు కమిషనర్ రంగనాథ్ గుర్తించారు. ఈ క్రమంలో అక్కడ సర్వే పూర్తయ్యే వరకు ఎలాంటి నిర్మాణాలు చేపట్టకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.చెరువులోకి నీరు వచ్చే నాలాను బిల్డర్లు దారి మళ్లించినట్లు గుర్తించారు.చెరువులు, కుంటలు, నాలాల పరిరక్షణ కోసం హైడ్రా ఏర్పాటు పట్ల హైకోర్టు సానుకూలత వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. ప్రభుత్వ సూచనలకు అనుగుణంగా బాచుపల్లిలోని ఎర్రకుంట చెరువును పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసుకున్నారు. ఆ చెరువులోని అక్రమ నిర్మాణాలను కూల్చివేసి వ్యర్థాలను తొలగించిన హైడ్రా అక్కడ తదుపరి కార్యాచరణను మొదలుపెట్టింది.ఆ ప్రాంతాన్ని రంగనాథ్ మరోసారి సందర్శించి అక్కడ చేయాల్సిన అభివృద్ధిపై స్థానికులు, అధికారులతో చర్చించారు. అలాగే స్థానికుల ఆహ్వానం మేరకు బండారి లేఔట్‌ను సందర్శించారు. ఇక, సమీపంలోని తుర్కచెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా చెరువులో ఆక్రమణలతోపాటు కలుషితనీరు కలుస్తుందని స్థానికులు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.ఈ నేపథ్యంలో తుర్కచెరువు అభివృద్ధి కోసం యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తామని రంగనాథ్ తెలిపారు. మాదాపూర్‌లోని మేడి కుంట చెరువు, ఈదులకుంట, నార్సింగ్ లోని నెక్నాంపూర్ చెరువు, తెల్లాపూర్‌లోని వనం చెరువు, చెల్లికుంట, మేళ్ల చెరువులను పరిశీలించిన రంగనాథ్.. ఈ సందర్భంగా స్థానికులు ఇచ్చిన ఫిర్యాదులను స్వీకరించారు. .ఈ క్రమంలో ఈదులకుంట చెరువు ఏ మండలం పరిధిలోకి వస్తుంది? ఓవర్ ల్యాపింగ్ ఎలా అయింది? గతంలో చేసిన సర్వే వివరాలు ఏంటి? రికార్డులు ఎక్కడున్నాయంటూ కూకట్ పల్లి, శేరిలింగంపల్లి రెవెన్యూ అధికారులను రంగనాథ్ ప్రశ్నించారు. గతంలో సర్వే చేసిన రిపోర్టులను పునఃపరిశీలించారు.ఆక్రమణలను తక్షణమే తొలగిస్తామని,ఆ చెరువు పునరుద్దరణకు అన్ని చర్యలు చేపడతామని స్థానికులకు హామీ ఇచ్చారు రంగనాథ్.

# రైతులను దగా చేసినందుకు పండుగ చేస్తున్నావా.. రేవంత్ రెడ్డిని నిలదీసిన హరీశ్‌రావు

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి చేపట్టిన విజయోత్సవాలపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు.ఏడాది పాలనలో రైతులను విజయవంతంగా దగా చేసినందుకు రైతు పండుగ అంటూ మూడు రోజుల విజయోత్సవాలు చేస్తున్నావా అని ప్రశ్నించారు. గొప్పగా చెప్పిన వరంగల్ రైతు డిక్లరేషన్‌లోని 9 హామీల్లో ఒక్కటీ అమలు చేయనందుకు పండుగ చేస్తున్నావా అని మండిపడ్డారు. రుణమాఫీ ఎగ్గొట్టి, రైతు భరోసా బోగస్ చేసి, కనీస మద్దతు ధరకు పంట కొనుగోలు చేయకుండా రైతులను ఏడ్పిస్తున్నందుకు చేస్తున్నావా అని నిలదీశారు. మీ ఏడాది దుర్మార్గ పాలనలో 563 మంది రైతులు ప్రాణాలు కోల్పోయినందుకు పండుగ చేస్తున్నావా అని మండిపడ్డారు.చెప్పింది కొండంత, చేసింది గోరంత అని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. ఎన్నికల ప్రచారంలో రైతులను మభ్య పెట్టాడని.. అధికారంలోకి వచ్చాక నిండా ముంచాడని రేవంత్ రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేసిందని హరీశ్‌రావు ప్రశ్నించారు. కేసీఆర్ ఇచ్చిన రైతుబంధు పథకానికి ఎగనామం పెట్టారని అన్నారు. నూటొక్క దేవుళ్ల మీద ఒట్టు పెట్టి రుణమాఫీ చేస్తానని మోసం చేశారని అన్నారు. సగం మందికి మొండి చెయ్యి చూపారని విమర్శించారు. 24 గంటల నాణ్యమైన కరెంటు అందించలేక చేతులెత్తేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పంటలకు మద్దతు ధర లేదని.. అన్ని పంటలకు బోనస్ అసలే లేదని.. పత్తి అయినా, ధాన్యం అయినా కొనుగోలు కేంద్రాలు లేవని అన్నారు. కౌలు రైతులకు, రైతు కూలీలకు ఇస్తానన్న భరోసా దిక్కులేదని విమర్శించారు.ఈ ఏడాది పాటు రైతులకు మీరు చేసిన మోసాన్ని కప్పిపుచ్చుకునేందుకు రైతు పండుగ నిర్వహించడం సిగ్గుచేటు అని హరీశ్‌రావు విమర్శించారు. పైగా, ఏడాది పాలనలో రైతు సంక్షేమం కోసం 54,280 కోట్లు ఖర్చు చేసినట్లు ప్రచారం చేసుకోవడం నవ్విపోదురుగాక నాకేంటి సిగ్గు అన్నట్టుగా ఉందని వ్యాఖ్యానించారు. రైతు బీమా, ఉచిత విద్యుత్, ధాన్యం కొనుగోళ్ల కోసం మీరు ఖర్చు చేసినా అని చెప్పిన రూ. 27,486 కోట్లు గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు చేసిందని తెలిపారు. ఏ ప్రభుత్వం ఉన్నా చేయాల్సి ఉంటుందే అని చెప్పారు. కానీ, కొత్తగా తామేదో రైతులకు చేసినట్లు డబ్బా కొట్టుకోవడం రైతులను మరోసారి మోసం చేయడమే అని అన్నారు. ఇదేనా కాంగ్రెస్ మార్కు మార్పు అని ప్రశ్నించారు.మీ మేనిఫెస్టో ప్రకారం రైతులకు పడిన బాకీ రుణమాఫీ కింద దాదాపు 14,000 కోట్లు.. ఖరీఫ్ రైతు బంధు కింద 7,500 కోట్లు.. కౌలు రైతులకు మరో 3,000 కోట్లు.. రైతు కూలీలకు 1600 కోట్లు.. అన్ని పంటలకు బోనస్ సుమారు 3,000 కోట్లు అకాల వర్షాలకు గానూ పంట నష్టం సుమారు 11,700 కోట్లు (కేంద్రానికి రాష్ట్రం పంపిన రిపోర్టు).. ఇలా ఈ ఏడాది కాలంలో మొత్తం రూ. 40,800 కోట్లు రైతులకు బాకీ పడ్డారని హరీశ్‌రావు తెలిపారు.

( మొదటి పేజీ తరువాయి )

# పిల్లలు చనిపోతే తప్ప స్పందించరా? అధికారులు నిద్రపోతున్నారా?: మాగనూర్ ఘటనపై తెలంగాణ హైకోర్టు తీవ్ర ఆగ్రహం

నారాయణపేట జిల్లా మాగనూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో కలుషిత ఆహారం కారణంగా విద్యార్థులు ఆసుపత్రి పాలైన ఘటనపై హైకోర్టు తీవ్రంగా స్పందించింది. పాఠశాలలో ఫుడ్ పాయిజన్ తీవ్రమైన అంశమని పేర్కొన్న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే.. అధికారులు నిద్రపోతున్నారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారంలో మూడుసార్లు భోజనం కలుషితమైతే అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. పిల్లలు చనిపోతే తప్ప స్పందించరా? అని నిలదీశారు.అధికారుల నిర్లక్ష్యానికి ఇది నిదర్శనమన్న న్యాయస్థానం.. ప్రభుత్వం ఈ ఘటనలను సీరియస్‌గా తీసుకోవడం లేదని మండిపడింది. హైకోర్టు ప్రశ్నలపై స్పందించిన ప్రభుత్వ న్యాయవాది వారం రోజుల్లో కౌంటర్ దాఖలు చేస్తామని చెప్పారు. ఆయన స్పందనపైనా న్యాయస్థానం మండిపడింది. వివరాల సేకరణకు వారం రోజులు ఎందుకని ప్రశ్నించింది. ఆదేశాలు ఇస్తే కానీ పనిచేయరా? అని ఆగ్రహం వ్యక్తం చేసింది.

# ప్రధాని మోదీని కలిసిన తెలంగాణ బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు

ప్రధాని నరేంద్రమోదీని తెలంగాణ బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు కలిశారు. వారితో పాటు కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ కూడా ఉన్నారు. వారు ప్రధాని మోదీకి శాలువా కప్పి సత్కరించారు. ఎంపీలను, ఎమ్మెల్యేలను ప్రధాని ఆప్యాయంగా పలకరించారు. వారితో వివిధ అంశాలపై మాట్లాడారు. ప్రధానిని కలిసిన వారిలో ఎంపీలు డీకే అరుణ, ఈటల రాజేందర్, రఘునందన్ రావు, ధర్మపురి అర్వింద్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, గోడం నగేశ్, ఎమ్మెల్యేలు రాజాసింగ్, కాటిపల్లి వెంకటరమణారెడ్డి తదితరులు ఉన్నారు. మోదీ ఈ సందర్భంగా రాజాసింగ్‌ను తన దగ్గరకు పిలిచి భుజం తట్టారు.

# నవంబర్ 30 నుంచి డిసెంబర్ 7 వరకు బీఆర్ఎస్ 'గురుకుల బాట': కేటీఆర్

గురుకుల, పాఠశాల విద్యను రేవంత్ రెడ్డి ప్రభుత్వం సంక్షోభంలోకి నెట్టిందని కేటీఆర్ ఆరోపించారు. 11 నెలల్లో 52 మంది విద్యార్థుల మృతి చెందారని, ఇందులో 38 ఫుడ్ పాయిజన్ సంఘటనలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పాలన గాలికొదిలేసి నేరపూరిత నిర్లక్ష్యంతో ఈ ముఖ్యమంత్రి విద్యార్థులను పొట్టన పెట్టుకున్నారని ఆరోపించారు. రాష్ట్రానికి కనీసం విద్యాశాఖ మంత్రి లేడన్నారు. అయినా సీఎం ఢిల్లీకి తిరిగేందుకే సమయం సరిపోవడం లేదని ఎద్దేవా చేశారు.విద్యార్థులు చనిపోతున్నప్పటికీ ఒక్క సమీక్ష నిర్వహించని ప్రభుత్వానికి ఉసురు తప్పదని హెచ్చరించారు. గురుకులాలు, కేజీబీవీ, మోడల్ స్కూళ్ల పరిస్థితులను అధ్యయనం చేసేందుకు బీఆర్ఎస్ తరఫున అధ్యయన కమిటీ వేస్తున్నామన్నారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ఐదుగురు సభ్యులతో గురుకుల అధ్యయన కమిటీ వేస్తున్నట్లు తెలిపారు. గురుకులాలను పరిశీలించి ఈ కమిటీ నివేదిక ఇస్తుందన్నారు. ఈ అంశాలను తాము అసెంబ్లీలో లేవనెత్తుతామన్నారు.

# కాంగ్రెస్ నేతల మధ్య ఎలాంటి విభేదాల్లేవు: భట్టి విక్రమార్క

తెలంగాణలో కాంగ్రెస్ నేతల మధ్య ఎలాంటి విభేదాలు లేవని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. తమలో విభేదాలు అంటూ పసలేని విమర్శలు చేస్తే ప్రతిపక్షాలకు ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తోన్న అభివృద్ధిని చూసి ఓర్వలేక కొంతమంది కాకుల్లా అరుస్తున్నారని విమర్శించారు. మంత్రివర్గ విస్తరణ విషయమై పార్టీ అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుందన్నారు. కాగా, మూసీ నిర్వాసితులు వ్యాపారాలు చేసుకోవడానికి రుణ సదుపాయం కల్పిస్తామని భట్టి విక్రమార్క వెల్లడించారు. హైడ్రా, మూసీ విషయంలో పూర్తిగా ఆలోచించాకే ముందుకు పోతున్నామన్నారు. మూసీ ప్రాజెక్టు విషయంలో హైకోర్టు ఇచ్చిన తీర్పును తాము స్వాగతిస్తున్నామన్నారు. ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకొని బీఆర్ఎస్ నేతలు వేలాది ఎకరాలు కాజేశారన్నారు. బీఆర్ఎస్ నేతలు కాజేసిన భూముల వివరాలను బయటకు తీస్తామన్నారు.

# కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో మంత్రి పొన్నం ప్రభాకర్ భేటీ

కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ భేటీ అయ్యారు. రాష్ట్రానికి సంబంధించి పలు అనుమతుల కోసం మంత్రి విజ్ఞప్తి చేశారు.తెలంగాణలో రవాణా శాఖ వాహనాల రిజిస్ట్రేషన్లను వాహన్ పోర్టల్‌కు, డ్రైవింగ్ లైసెన్సులు సారథి పోర్టల్‌కు మార్చడం, వాహన స్క్రాపింగ్ సౌకర్యాల ఏర్పాటు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చిల్డ్రన్ ట్రాఫిక్ అవేర్‌నెస్ పార్కుల ఏర్పాటు రోడ్డు భద్రత అవగాహన ప్రచారాలను నిర్వహించడం వంటి అనేక కార్యక్రమాలు చేపడుతోందని మంత్రి పొన్నం ప్రభాకర్ కేంద్ర మంత్రికి తెలిపారు. రెండు రిజిస్టర్డ్ వెహికల్ స్క్రాపింగ్ ఫెసిలిటీ కేంద్రాలు ఇప్పటికే ఆమోదించబడ్డాయి. 37 (ముప్పై ఏడు) ఆటోమేటెడ్ వెహికల్ ఫిట్‌నెస్ టెస్టింగ్ స్టేషన్‌లను ఏర్పాటు చేయడానికి పరిపాలనా అనుమతి ఇవ్వబడింది. ఎలక్ట్రిక్ వాహనాల వాడకాన్ని ప్రోత్సహించడానికి, తెలంగాణ రాష్ట్రంలో కొనుగోలు చేసిన, రిజిస్టర్ చేయబడే వివిధ రకాల ఎలక్ట్రిక్ వాహనాలకు 100 శాతం రోడ్డు పన్ను, రిజిస్ట్రేషన్ ఫీజులను మినహాయిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. **కేంద్ర ప్రభుత్వం మద్దతు కోసం విజ్ఞప్తి చేసిన అంశాలు ఇవే:** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఇటీవల 40 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించామని, అక్కడ ఈ కింది వాటికి అనుమతి ఇవ్వాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కేంద్ర మంత్రిని కోరారు. ఢిల్లీలోని తరహాలో 15వ ఫైనాన్స్ కమిషన్ కింద హైదరాబాద్ మెట్రోపాలిటన్ ఏరియాలో డ్రైవర్లకు చాలా శిక్షణ అవసరం ఉన్నందున ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డ్రైవింగ్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని కోరారు. బహుళ-లేన్ ఆటోమేటిక్ వెహికల్స్ ఫిట్‌నెస్ టెస్టింగ్ స్టేషన్‌ను నిర్మించడానికి అనుమతి ఇవ్వాలన్నారు. రోడ్ సేఫ్టీ కోసం పబ్లిక్ వాహనాల పర్యవేక్షణ కోసం ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. హైదరాబాద్ ప్రాంతంలో ఎలక్ట్రానిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అమలు కోసం, ఈ-చలాన్‌ల ఆటో జనరేషన్ ద్వారా జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులను గుర్తించాలని విజ్ఞప్తి చేశారు.

## రాయల్ బెంగాల్ టైగర్ ఇక లేదు..!



**శాసనసభ / హైదరాబాద్ :** రాయల్ బెంగాల్ టైగర్ మృతి చెందింది. తిరుపతి శ్రీ వెంకటేశ్వర జూ పార్కులో ఈ ఘటన చోటు చేసుకుంది. 2018లో 11 ఏళ్ల వయస్సు ఉన్న ఈ పులిని బెంగళూరులోని బన్నెరగట్ట బయోలాజికల్ పార్క్ నుంచి తీసుకొచ్చినట్లు అధికారులు తెలిపారు.మృతి చెందిన టైగర్‌ను మధు అని ముద్దుగా పిలుచుకుంటారు.ఈ టైగర్‌కు 11 సంవత్సరాలు.మృతి చెందిన టైగర్ వృద్ధాప్యంతో బాధపడుతున్నట్లు తెలుస్తోంది.వృద్ధాప్యం వల్ల అనేక అవయవాలు పనిచేయకపోవడం, ఆహారం సరిగా తినకపోవడం వంటి కారణాల వల్ల మృతి చెందిందని జూ అధికారులు తెలిపారు.రెండేళ్ల నుంచి అనారోగ్యంగా ఉన్న ఈ పులిని సందర్శనకు ఉంచకుండా, ప్రత్యేక సెల్ లో ఉంచి వైద్యం అందిస్తున్నట్టు జూ క్యురేటర్ సెల్వం పేర్కొన్నారు. ఆరోగ్యం క్షీణించడంతో రాయల్ బెంగాల్ టైగర్ ఈరోజు మధ్యాహ్నం కన్నుమూసిందని పోస్టుమార్టం నివేదికలో వెల్లడైంది.

## వరుడి వెతుకులాటలో రోడ్డెక్కిన ఇన్‌ఫ్లూయెన్సర్.. ప్లకార్డు చేతితో పట్టుకుని మరీ..






**శాసనసభ / ఢిల్లీ :** గత కొంతకాలంగా భారత్‌లో వధూవరుల విషయంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తమకు తగిన వరుడు లేదా వధువును గుర్తించేందుకు వివిధ మ్యారేజ్ బ్యూరోలు, మధ్యవర్తులను కలవాల్సి వస్తోంది.ఏళ్ల తరబడి తిరిగితే కానీ బిడ్డలకు పెళ్లి చేయలేకపోతున్నామని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో ఓ సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్ చేసిన పని నెట్టింట వైరల్ అవుతోంది.సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ అయిన సయాలీ సావంత్ వరుడి కోసం వెతుకులాటలో భాగంగా రోడ్డెక్కారు. ఆమెకు దాదాపు 78 వేల మంది ఫాలోవర్లు ఉండటం విశేషం. ఆమె ముంబైలోని ప్రముఖ పర్యాటక ప్రదేశం తాజ్ హొటల్ ముందు ఓ ప్లకార్డుతో దర్శనమిచ్చారు. తన ఫోటోతో కూడిన వివరాలు అందులో పొందుపరిచి, వరుడి కోసం వెతుకుతున్నట్లు పేర్కొంది. కాబోయే భర్త కోసం ఓ షరతు కూడా విధించింది. తనకంటే అతడు పొడవుగా ఉండాలని కోరుకుంటున్నట్లు చెప్పింది.ఈ అసాధారణమైన చర్య అక్కడ పలువురి దృష్టిని ఆకర్షించింది. చాలా మంది ఆమెతో సెల్ఫీలు తీసుకోవడం, ఫొటోలు తీయడం సహా రీల్స్ చేయడం ప్రారంభించారు. మరికొంతమంది పురుషులు పాజిటివ్‌గా స్పందించి స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు కూడా. 'ముల్గా రెడీ అహే అమ్చా (ఒక అబ్బాయి మాకోసం సిద్ధంగా ఉన్నాడు) అంటూ స్నేహితుల బృందం సరదాగా టీజ్ చేసింది.ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట రచ్చ చేస్తోంది. ఇప్పటి వరకు 14 వేలకు పైగా లైక్‌లు రావడంతో పాటు కామెంట్ల వర్షం కురుస్తోంది. చాలా మంది సావంత్ సాహసోపేతమైన విధానాన్ని మెచ్చుకుంటూ డేరింగ్ సయాలీ హ్యాట్ ఆఫ్, సయాలీ నువ్వు గ్రేట్ అని పోస్టులు పెడుతున్నారు. మరికొందరు తమ గ్రామంలో ఓ అబ్బాయి పెళ్లికోసం వేచి చూస్తున్నాడంటూ కామెంట్స్ చేశారు.

## త్వరలో రేషన్ కార్డులు అందజేస్తాం



**శాసనసభ / హైదరాబాద్ :** కాళేశ్వరం నీటి చుక్క వాడకుండానే ఎల్లంపల్లి నుంచి నీరు పొదుపుగా వాడుకొని పెద్ద ఎత్తున వరి పంట పండించామని మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు.డిఫాల్ట్ రైస్ మిల్లర్లు ఉంటే ఇప్పటికైనా క్లియర్ చేయాలని ఆయన సూచించారు. సన్న వడ్లకు బోనస్ రాకుంటే ప్రతిపక్ష నాయకులు మా దృష్టి కి తీసుకురావాలి.. రాని వారికి డబల్ ఇస్తామని ఆయన పేర్కొన్నారు. అసెంబ్లీలో రైతు భరోసా పై చర్చించి తప్పకుండా ఇస్తామని ఆయన తెలిపారు. మహారాష్ట్ర లో జాతీయ పార్టీగా ప్రకటించిన బీఆర్ఎస్ అక్కడ ఒక సీట్ కి కూడా పోటీ చేయలేదు.. గెలువలేదని,మహారాష్ట్రలో బీజేపీ గెలిస్తే సంతోషపడుతున్నా రా.. కాంగ్రెస్ ఓడిపోయినందుకు సంతోషపడుతున్నారా బీఆర్ఎస్ నాయకులు చెప్పాలన్నారు. బీజేపీ బీఆర్ఎస్ ఒకటే అని, గల్లీలో కుస్తీ ఢిల్లీలో దోస్తీ చేస్తోందన్నారు పొన్నం ప్రభాకర్.బీజేపీ కి బీఆర్ఎస్ బీ టీం అని ఆయన విమర్శించారు. బస్‌లలో అల్లం, ఎల్లిపాయలు పొట్టుతీస్తూ, పని లేకుండా తిరుగుతున్నారని మహిళల్ని అవమానించింది బీఆర్ఎస్ పార్టీ అని ఆయన మండిపడ్డారు. త్వరలో రేషన్ కార్డులు అందజేస్తామని ఆయన స్పష్టం చేశారు. వేములవాడ లో పెద్ద అన్నదాన సత్రం చేపట్టామని, అవాస్తవాలు ప్రచారం చేయద్దన్నారు మంత్రి పొన్నం ప్రభాకర్. ప్రభుత్వాన్ని బద్నాం చేయడానికి మొదటి రెండు నెలలు కరెంటు తెలువకుండా కట్ చేశారు.. అధికారులను సస్పెండ్ చేసి నట్లు టైట్ చేస్తే సెట్ అయ్యారన్నారు.

## తిరుమలకు వెళ్ళే సామాన్య భక్తులకు వైకుంఠ ద్వార దర్శనాలపై టీటీడీ శుభవార్త!

**శాసనసభ / ఢిల్లీ :** తిరుమలలో భక్తులకు సౌకర్యాలపై నిత్యం కసరత్తు చేస్తున్న టీటీడీ తిరుమల వేదికగా జరిగే ఉత్సవాలపై అంతే బాగా ఫోకస్ చేస్తుంది. ఇప్పటికే తిరుచానూరులో పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించాలని ఏర్పాట్లు చేస్తున్నారు.ఇదే సమయంలో వైకుంఠ ఏకాదశికి సంబంధించి వైకుంఠ ద్వార దర్శనాలకు ఏర్పాట్లు ఘనంగా చెయ్యాలని నిర్ణయించారు.వచ్చే జనవరి 10న వైకుంఠ ఏకాదశి ఉండటంతో వైకుంఠ ద్వార దర్శనాల విషయంలో టీటీడీ అడిషనల్ ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి సమీక్షా సమావేశం నిర్వహించారు. నేడు మధ్యాహ్నం తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమావేశంనిర్వహించి ఆయన కీలక ఆదేశాలు ఇచ్చారు. జనవరి 10 నుంచి 19వ తేది వరకు, మొత్తం 10 రోజుల పాటు భక్తులకు వైకుంఠ ద్వార దర్శనాలను టీటీడీ కల్పించనుంది.ఇక శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనాలకు నలభై రోజులు మాత్రమే ఉండటంతో అధికారులు అన్ని విధాలుగా సన్నద్ధం కావాలని ఆయా శాఖల అధికారులందరినీ అడిషనల్ ఈఓ ఆదేశించారు. అయితే పది రోజుల పాటు జరిగే వైకుంఠ ద్వార దర్శనాల్లో సాధారణ భక్తులకు ప్రాధాన్యత ఇవ్వాలని టీటీడీ అడిషనల్ ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి పేర్కొన్నారు.వైకుంఠ ద్వార దర్శనాల పది రోజుల్లో వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చెయ్యాలని నిర్ణయించారు. ప్రోటోకాల్ వీఐపీలకు మాత్రం దర్శనాలు కల్పించనుంది. జనవరి 10 నుండి 19వ తేది వరకు వరకు 10 రోజుల పాటు చంటి బిడ్డలు, వృద్ధులు, దివ్యాంగులు, ఆర్మీ, ఎన్ఆర్ఐ దర్శనాలు రద్దు



చెయ్యాలని నిర్ణయించారు. జనవరి 09 నుండి 19 వరకు ఆర్జిత సేవలు రద్దు చేయనున్నట్టు నిర్ణయం తీసుకున్నారు.సాధారణ భక్తులకు ఎక్కువ దర్శన సమయం కల్పించేలా జారీ చేయాల్సిన టికెట్ల కోటా పైన , అలాగే ఇతర అంశాలపై మరో రెండు వారాల్లో మరో సమీక్ష సమావేశం నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. వైకుంఠ ఏకాదశికి కావలసిన పూల అలంకరణలు, భక్తులకు వసతి, శ్రీవారి సేవకులు, స్కౌట్‌లను నియమించడం, ట్రాఫిక్ నిర్వహణ, పారిశుద్ధ్యం, ఇతర అంశాలపై కూడా ఆయన చర్చించారు.జనవరి 10న స్వర్ణ రథం ఊరేగింపు ఉంటుందని, అలాగే 11న చక్ర స్నానం నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఇది ఎస్వీబీసీలో ప్రత్యక్ష ప్రసారం చేయబడుతుందని పేర్కొన్నారు. ఇక మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద కేంద్రంలో 10 రోజుల పాటు ఉదయం 6 గంటల నుండి అర్ధరాత్రి 12 గంటల వరకు అన్న ప్రసాదం పంపిణీ చేయబడుతుందని కూడా ఈ సమావేశంలో నిర్ణయించారు.


## ప్రధాని మోదీ విశాఖ పర్యటన రద్దు.. ఏపీ ప్రజల ఆశలపై నీళ్ళు!

**శాసనసభ / ఢిల్లీ :** ఏపీ వాసుల కలలు నెరవేర్చేందుకు చేయ తలపెట్టిన భారత ప్రధాని మోదీ విశాఖ పర్యటన రద్దయ్యింది. ఏపీ వాసుల ఆశలపై తుఫాను నీళ్ళు చల్లింది. తీవ్ర తుఫాన్ ఏపీకి పొంచి ఉన్న నేపధ్యంలో, ఐఎండీ హెచ్చరికలతో ప్రధాని మోదీ పర్యటన రద్దయినట్టు ప్రధానమంత్రి కార్యాలయం ప్రకటించింది. భారత ప్రధాని నరేంద్ర మోడీ ఈనెల 29వ తేదీన విశాఖ నగరంలో పర్యటిస్తారని అధికారులు ఏర్పాట్లలో బిజీగా ఉన్నారు. ప్రధాని పర్యటనలో భాగంగా అక్కడ రోడ్ షో లోనూ, ఆంధ్ర యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీ గ్రౌండ్లో నిర్వహించే బహిరంగ సభలోనూ పాల్గొనాల్సి ఉండగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే తాజా తుఫాను హెచ్చరికల నేపధ్యంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన రద్దయ్యింది.తుఫాను ప్రభావం ఏపీలోని కోస్తాంధ్రపై ఉండనున్న నేపధ్యంలో ఈ నెల 29వ తేదీన జరగవలసిన ఆయన పర్యటనను రద్దు చేస్తూ పీఎంఓ ఆఫీసు నిర్ణయం తీసుకుంది. ప్రధాని మోదీ పర్యటన కోసం ఆంధ్రా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో లక్ష మందితో సభ నిర్వహించాలని నిర్ణయించారు. ఈ క్రమంలో భారీ ఏర్పాట్లను కూడా చేస్తున్నారు. కానీ అనుకోని విధంగా వాతావరణ పరిస్థితుల కారణంగా మోదీ విశాఖ పర్యటన రద్దయ్యింది.ఏపీ ప్రజలు ప్రధాని మోదీ



పర్యటనపై చాలా ఆశగా ఎదురు చూస్తున్న క్రమంలో తుఫాను ప్రజల ఆశలను అడియాశలు చేసింది. ఒకవేళ మోదీ విశాఖలో పర్యటిస్తే అనకాపల్లి జిల్లా అచ్చుతాపురం మండలం పూడిమడకలో 85000 కోట్లు పెట్టుబడితో నిర్మించే ఎన్టిపిసి నిర్మించే గ్రీన్ హైడ్రోజన్ హబ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలను ముఖ్యంగా విశాఖవాసుల దశాబ్దపు కల రైల్వే జోన్ 2కు కూడా ప్రధాన నరేంద్ర మోడీ శంకుస్థాపన చేసేవారని సమాచారం.వీటితో పాటు అనేక కీలక ప్రాజెక్ట్ లకు శంకుస్థాపనలు చెయ్యాల్సి ఉంది. అక్కడ ఏర్పాటు చేసిన రోడ్ షోలోనూ, అలాగే భారీ బహిరంగ సభలోనూ ఆయన ప్రసంగించాల్సి ఉంది. కానీ ఆయన పర్యటన రద్దుతో ఆ అవకాశం లేకుండా పోయింది. మోదీ పర్యటన ఉందని జోష్ లో ఉన్న బీజేపీ శ్రేణులను సైతం తుఫాను హతాశులను చేసింది.

## ఏఈఈ-డీఈఈ ఇంజనీర్లపై కాళేశ్వరం కమిషన్ చీఫ్ అసహనం



**శాసనసభ / హైదరాబాద్ :** కాళేశ్వరం ప్రాజెక్ట్ కుంగుబాటు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపిన విషయం తెలిసిందే. అయితే.. దీనిపై సమగ్ర విచారణ కోసం రాష్ట్ర ప్రభుత్వం చీఫ్ జస్టిస్ చంద్ర ఘోష్ నేతృత్వంలో కాళేశ్వర కమిషన్‌ను ఏర్పాటు చేసింది.అయితే.. ఈ క్రమంలోనే నేడు మేడిగడ్డ అన్నారం సుందిళ్ల బ్యారేజీల వద్ద పనిచేసిన DEE -AEE లను కమిషన్ చీఫ్ జస్టిస్ చంద్ర ఘోష్ విచారించించారు. విచారణలో AEE DEE ఇంజనీర్లపై కమిషన్ చీఫ్ జస్టిస్ చంద్ర ఘోష్ అసహనం వ్యక్తం చేశారు. అడిగిన ప్రశ్నలకు మాత్రమే సమాధానాలు చెప్పాలి ముందుగా అనుకొని వచ్చి పొంతన లేని సమాధానాలు చెప్పొద్దు అని కమిషన్ చీఫ్ వ్యాఖ్యానించారు. ఫీల్డ్ లో జరిగిన పనులకు సంబంధించిన రిజిస్టర్లను సంతకాలు చేసుకున్న కమిషన్.. రిజిస్టర్లలో ఇంజనీర్ల చేత సంతకాలు తీసుకున్నారు. మేడిగడ్డ బ్లాక్ 7కు సంబంధించిన ఫీల్డ్ వర్క్ ప్లేస్మెంట్ రిజిస్టర్ లను సంతకాలు చేయించుకున్నారు. కాళేశ్వరంలో జరిగిన పనులపై ప్లేస్మెంట్ రికార్డులు రోజువారిగా చేశారా లేదా? ఒకరోజు పనిని మరొక రోజు నమోదు చేశారని కమిషన్ ప్రశ్నించింది.కుంగిన పిల్లర్లకు సంబంధించిన బ్లాక్ 7 రిజిస్టర్ లపై ఇంజనీర్ల సంతకాలు తీసుకుంది కమిషన్. 2020లోని కాళేశ్వరం ప్రాజెక్టు మేడిగడ్డ బ్యారేజీ వద్ద డ్యామేజీని గుర్తించి ఉన్నతాధికారులకు నిర్మాణ సంస్థలకు లేఖలు రాసినట్లు ఇంజనీర్లు తెలిపారు. మొదటి డ్యామేజీ 2020లోనే జరిగినట్లు గుర్తించి లేఖలు రాసినట్లు కమిషన్ ముందు ఇంజనీర్లు చెప్పినట్లు తెలుస్తోంది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో క్వాలిటీ కంట్రోల్ రిజిస్టర్లు మిస్ అయినట్లు కమిషన్ గుర్తించింది. మేడిగడ్డ బ్లాక్ 7తో పాటు మూడు బ్యారేజీలకు సంబంధించిన వర్క్ ప్లేస్మెంట్ రిజిస్టర్ లను స్వాధీనం చేసుకుంది కాళేశ్వరం కమిషన్.

## మహారాష్ట్ర సీఎం రేసులో బిగ్ ట్విస్ట్-అజిత్ కింగ్ మేకర్ గా ఆయనే సీఎం..!



**శాసనసభ / హైదరాబాద్ :** మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని మహాయుతి కూటమి సాధించిన ఘన విజయం తర్వాత 72 గంటల్లో ప్రభుత్వం ఏర్పాటు చేయాల్సిన పరిస్థితి తలెత్తింది.మహా రాష్ట్ర అసెంబ్లీ గడువు ఇప్పటికే ముగియడంతో ఇవాళ ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రభుత్వ ఏర్పాటుపై నిర్ణయం తీసుకోక తప్పడం లేదు. ఈ నేపథ్యంలో మహారాష్ట్రకు కొత్త సీఎంగా ఎవరికి ఛాన్స్ దక్కబోతోందన్న ఉత్కంఠ నెలకొంది. ఇలాంటి సమయంలో భారీ ట్విస్ట్ ఎదురైంది.మహారాష్ట్ర సీఎంగా గత మూడేళ్లుగా అధికారం చెలాయించిన ఏక్ నాథ్ షిండే కు తిరిగి పగ్గాలు అప్పగించాలని ఆయన పార్టీ నేతలు కోరుతుండగా.. బీజేపీ మాత్రం ఇందుకు ససేమిరా అంటోంది. 132 సీట్లు సాధించిన తమను కాదని సీఎం పదవిని 50 సీట్లు సాధించిన శివసేనకు ఎలా ఇస్తామని ప్రశ్నిస్తోంది. దీంతో గత మూడేళ్లలో షిండే పాలన వల్లే తిరిగి తాము అధికారంలోకి వచ్చామని శివసేన గుర్తుచేస్తోంది. ఈ తరుణంలో సీఎం రేసులో లేని మరో భాగస్వామి అజిత్ పవార్ కీలకంగా మారారు.మహారాష్ట్ర కొత్త సీఎం ఎంపికలో అజిత్ పవార్ కీలకంగా మారారు. ఇంకా చెప్పాలంటే ఇప్పుడు ఆయనే కీంగ్ మేకర్. ఎలాగో సీఎం కాలేని పరిస్థితుల్లో కొత్త ముఖ్యమంత్రిగా దేవేంద్ర ఫడ్నవీస్ కు అండగా నిలవడం ద్వారా ప్రభుత్వంలో డిప్యూటీ సీఎం సహా కీలక పదవులు తీసుకోవాలని అజిత్ పవార్ పట్టుదలగా ఉన్నారు. దీంతో షిండేకు బీజేపీతో కలిసి షాకివ్వాలని అజిత్ పవార్ భావిస్తున్నారు. అదే జరిగితే ఇవాళ సాయంత్రానికి ఫడ్నవీస్ సీఎంగా ఎంపికకావడం లాంఛనంగా కనిపిస్తోంది.

## ఇదేం పాలన సారూ?

- రైతుబంధు లేదు, బోనస్ లేదు
- ఒక్క హామీ అమలైతలేదు
- కేటీఆర్‌తో గిరిజన రైతుల ఆవేదన
- కాంగ్రెస్‌తో కొట్లాడాలని విజ్ఞప్తి
- మహబూబాబాద్ రూరల్, నవంబర్ 25: 'ఇదేం పాలన సారూ?



**హైదరాబాద్/శాసనసభ** : రైతుబంధు లేదు, బోనస్ లేదు.. ఒక్క హామీ అమలైతలేదు.. ఆరు గ్యారెంటీలు ఇచ్చేదాకా కాంగ్రెస్‌తో కొట్లాడుండ్రి' అని కేటీఆర్‌తో గిరిజన రైతులు ఆవేదన వెలిబుచ్చారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన మహాధర్నాలో పాల్గొన్న అనంతరం కేటీఆర్, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తొర్రూరు రోడ్డులో హైదరాబాద్ బయలుదేరారు. మార్గమధ్యలో మండల పరిధిలోని అమనగల్ శివారు బలరాంతండా వద్ద రోడ్డు వెంట ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద కేటీఆర్ తన కారు ఆపి గిరిజన రైతుల వద్దకు వెళ్లారు. ఆయనకు కొనుగోలు కేంద్రం వద్ద రైతులు సాదరస్వాగతం పలికారు. బలరాంతండాకు చెందిన ఇస్లావత్ బిచ్చా, బీ హేమలతతో కేటీఆర్ ఆప్యాయంగా ముచ్చటించారు. కాంగ్రెస్ పాలన ఎలా ఉన్నది? ఆరు గ్యారెంటీలు అమలవుతున్నాయా?, వడ్ల బోనస్ వచ్చిందా? అని ఆరా తీశారు. దీంతో రైతులు స్పందిస్తూ 'ఇదెక్కడి పాలన సార్.. ఇంత వరకు రైతులకు బోనస్ డబ్బులు రాలే.. సీజన్ ప్రారంభంలోనే కేసీఆర్ రైతుబంధు వేసిండు.. ఇంతవరకు రైతుబంధు రాకపాయె.. మహిళలకు ఉపాధి, భద్రత లేదు.. తులం బంగారం లేదు.. ఒక్క హామీ కూడా అమలు కావట్లే' అని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ హామీలు అమలు చేసే దాకా దళితులు, గిరిజనులు, రైతులు, ప్రజల పక్షాన బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని కేటీఆర్ వారికి ధైర్యం చెప్పారు.

**ఇట్లయితదనుకోలే**

కాంగ్రెస్ పార్టీ వస్తే రైతులకు మేలు చేస్తదనుకున్నం. ఇట్లయితదనుకోలే. ఈ ప్రభుత్వం వచ్చినంక రైతులే కాదు, అందరూ నష్టపోయింర్రు. అన్ని సన్న వడ్లే వెయ్యిమని చెప్తే వేసినం. వాటికి కూడా బోనస్ వస్తలేదు. కాంగ్రెస్ వచ్చిన దగ్గర నుంచి గిరిజనులను ఇబ్బంది పెడుతున్నది. లగచర్ల గిరిజన రైతులపై దాడులు చేసి బెదిరించడం మంచి పద్ధతికాదు. అక్కడ నాయకులు గూండాల లెక్క రైతులను కొడుతున్నరు. రైతులపై ఇట్ల దౌర్జన్యం చేయడం దారుణం. ధర్మారపు రాములు, రైతు **రైతులను రేవంత్ మోసం చేసిండు**

ఎక్కడలేని హామీలిచ్చి ఒక్కటీ అమలు చేయకుండా రైతులను రేవంత్‌రెడ్డి మోసం చేసిండు. ఒక్కసారే రెండు లక్షల రుణ మాఫీ చేస్తనని చెప్పి అనేక కొర్రీలు పెట్టిండు. కుటుంబంలో ముగ్గురం బ్యాంకు రుణాలు తీసుకుంటే ఒక్కరికే మాఫీ అయింది. శాన మంది రైతులు బ్యాంకుల చుట్టూ తిరుగుతాంర్రు. కాంగ్రెస్ వచ్చిన తర్వాత అన్ని సమస్యలే వస్తున్నయి. రైతుల బాధలు పట్టించుకునేటోళ్లే లేరు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించింర్రు. వడ్లు మాత్రం ఇంకా కొంటలేరు.

శాసనసభ
గురువారం 28 నవంబర్ - 2024

# లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా కుమార్తె రిసెప్షన్‌కు హాజరైన సీఎం రేవంత్..



శాసనసభ / హైదరాబాద్ : లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా కుమార్తె అంజలి బిర్లా 2024 నవంబర్ 12న సింధీ హిందూ మతానికి చెందిన అనీష్ రజనీని వివాహం చేసుకున్న విషయం తెలిసిందే. తాజాగా సోమవారం రాత్రి ఢిల్లీలో నిర్వహించిన ఓం బిర్లా కుమార్తె రిసెప్షన్ కు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరయ్యారు.వధూవరులు అంజలి, అనీష్ లను ఆశీర్వదించారు. కార్యక్రమంలో శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే చామల కిరణ్ కుమార్ రెడ్డి కూడా రేవంత్ వెంట ఉన్నారు.కాగా.. తాజాగా లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా కుమార్తె అంజలి బిర్లా ఓ ముస్లిం వ్యక్తిని వివాహం చేసుకున్నారని సోషల్ మీడియాలో పోస్ట్ వైరల్ అవుతోంది. 'కోట'లో వ్యాపార కుటుంబానికి చెందిన అనీసుర్ రెహమాన్ అనే ముస్లిం వ్యక్తిని వివాహం చేసుకున్నారని పోస్ట్ లో పేర్కొన్నారు. అయితే.. ఈ పోస్టుకు సంబంధించిన నిజం బయటపడింది. అంజలి బిర్లా సింధీ హిందూ మతానికి చెందిన అనీష్ రజనీని వివాహం చేసుకున్నారు. ఈ మేరకు పలు మీడియా సంస్థలు, వార్తాపత్రికలు కథనాలు ఈ విషయాన్ని ధృవీకరించాయి. ఇదే అంశంపై గయా మాజీ ఎంపీ, బీజేపీ నేత హరి మాంఝీ ఎక్స్ (ట్విట్టర్)లో స్పందించారు.. ఈ ప్రచారాన్ని నమ్మొద్దని కోరారు. ఆయన అంజలి బిర్లా, అనీష్‌ల వివాహ ఆహ్వాన పత్రికను కూడా షేర్ చేశారు. దీనిని బట్టి ఈ వైరల్ పోస్ట్ తప్పు అని తేలింది.

# రోడ్డుపైనే లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన ఇరిగేషన్ అధికారి



శాసనసభ / హైదరాబాద్ / పెద్దపల్లి : రూ. 20 వేల రూపాయల లంచం తీసుకుంటూ ఇరిగేషన్ ఏఈ ఏసీబీకి(ACB) పట్టుబడ్డారు. వివరాల్లోకి వెళ్తే..ఓ బిల్లు విషయంలో కాంట్రాక్టర్‌ను నుంచి ఏఈ నర్సింగరావు లంచం డిమాండ్ చేశారు.దీంతో చేసేదిలేక సదరు కాంట్రాక్టర్ ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. ఏసీబీ అధికారుల సూచనల మేరకు పెద్దపల్లి జిల్లా కేంద్రంలో రోడ్డుపైనే ఏఈకి కాంట్రాక్టర్ రూ.20 వేలు అందజేశారు. అక్కడే మాటు వేసిన ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి ఆధ్వర్యంలో సిబ్బంది దాడి చేసి పట్టుకున్నారు. అలాగే నీటిపారుదల శాఖ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# రాజీనామా వార్తలు ఖండించిన మహారాష్ట్ర కాంగ్రెస్ చీఫ్



శాసనసభ / హైదరాబాద్ : మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ వైఫల్యాన్ని నిరసిస్తూ రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్ష పదవికి నానా పటోలే రాజీనామా చేసినట్లు ఉదయం నుంచి వార్తలు హల్‌చల్ చేశాయి.తాజాగా ఆయన స్పందిస్తూ.. ఆ వార్తలు నిజం కాదని కొట్టిపారేశారు. రాజీనామా చేయలేదని వెల్లడించారు. మహా వికాస్ అఘాడీ కూటమి చెక్కుచెదరకుండా ఉందని నానా పటోలే స్పష్టం చేశారు.మహారాష్ట్ర అసెంబ్లీలో 288 సీట్లు ఉండగా.. మహాయుతి కూటమి 233 స్థానాల్లో విజయం సాధించింది. ప్రతిపక్ష మహావికాస్ అఘాడీ కూటమి 48 చోట్లే గెలుపొందింది. 101 స్థానాల్లో పోటీ చేసిన కాంగ్రెస్ కేవలం 16 స్థానాలు మాత్రమే గెలుచుకోవడంతో పార్టీకి పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. 2021లో నానా పటోలే మహారాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. మే నెలలో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో.. ఆయన నాయకత్వంలో కాంగ్రెస్ పోటీ చేసిన 17 స్థానాలకు గాను 13 స్థానాలను గెలుచుకుంది. అద్భుతమైన ప్రదర్శన కనబరిచింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన పోటీ చేసిన సాకోలీ స్థానం నుంచి 208 ఓట్ల ఆధిక్యంతో నానా పటోలే గెలుపొందారు.మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో బీజేపీకి 132, షిండే శివసేనకు 57, అజిత్ పవార్ ఎన్సీపీకి 41, ఉద్ధవ్ థాకరే పార్టీకి 20, కాంగ్రెస్‌కు 16, శరద్ పవార్ పార్టీకి 10, ఎస్పీకి 2, ఇతరులకు 10 సీట్లు వచ్చాయి. మొత్తం రాష్ట్రంలో 288 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి.ఇదిలా ఉంటే మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో మహాయుతి (బీజేపీ, శివసేన, ఎన్సీపీ) కూటమి ఘన విజయం సాధించింది. ఇక బీజేపీ అయితే సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే శక్తి.. సంఖ్యాబలం కలిగి ఉంది. 288 అసెంబ్లీ స్థానాలకు గాను ఏకంగా 132 అసెంబ్లీ స్థానాలను కమలనాథులు కైవసం చేసుకున్నారు. బీజేపీకి వచ్చిన సీట్లలో సగం మాత్రమే షిండేకు చెందిన శివసేనకు వచ్చాయి. ఎన్సీపీకి 41 స్థానాలు ఉన్నాయి. ఇప్పటికే బీజేపీకి సపోర్టు చేశారు. ఎన్సీపీ మద్దతుతో బీజేపీ వ్యక్తి సీఎం కాబోతున్నారు.

# బీఆర్ఎస్ ధర్నాతో రేవంత్ గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.. సత్యవతి రాథోడ్ ఆగ్రహం



శాసనసభ / హైదరాబాద్ : తెలంగాణ భవిష్యత్ ఆశాజ్యోతి కేటీఆర్ అని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. గిరిజనుల్లో ధైర్యం, భరోసా కల్పించడానికే కేటీఆర్ మానుకోటకు వచ్చారని తెలిపారు.కేసీఆర్ పోడు భూములకు పట్టాలు ఇచ్చారని అన్నారు. మనం ధర్నా చేస్తుంటే రేవంత్ రెడ్డి గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని చెప్పారు. కేటీఆర్ బయటకు వస్తేనే రేవంత్ రెడ్డి భయపడుతున్నారని ఎద్దేవా చేశారు.కొడంగల్ నియోజకవర్గంలోని లగచర్లలో దళిత, గిరిజన, పేద రైతులపై కాంగ్రెస్ ప్రభుత్వం దమనకాండకు నిరసనగా మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మహా ధర్నా నిర్వహించారు. ఈ మహాధర్నాకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, ఎర్రబెల్లి దయాకర్ రావు, జగదీశ్ రెడ్డి, మాజీ స్పీకర్ మధుసూదనాచారి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మధుసూదనాచారి మాట్లాడుతూ.. పదేళ్లలో దేశానికే ఆదర్శంగా తెలగాణను కేసీఆర్ తీర్చిదిద్దారని అన్నారు. పదేళ్లు కేసీఆర్ అద్భుతమైన పాలన కొనసాగించారని తెలిపారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో ప్రజా జీవనాన్ని అతలాకుతలం చేస్తుందని విమర్శించారు. కాంగ్రెస్ హయాంలో ప్రజలకు నరకం చూపిస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ దుర్మార్గ పాలనకు చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ మహాధర్నాకు అడ్డుకునేందుకు సీఎం రేవంత్ రెడ్డి కుట్ర పన్నుతున్నారని మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి విమర్శించారు. రేవంత్ రెడ్డి భూములు లాక్కోవడమే పనిగా పనిచేస్తున్నారని అన్నారు. అడ్డుకున్న వారిపై కేసులు నమోదు చేయడమే మరో ఎజెండా పెట్టుకున్నారని మండిపడ్డారు. ఇది మానుకోట మాత్రమే కాదు.. మొత్తం తెలంగాణ గర్జన అని స్పష్టం చేశారు.బీఆర్ఎస్ మహాధర్నాతో కాంగ్రెస్ పాలకుల్లో వణుకు మొదలైందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. గిరిజన జాతి మొత్తం బీఆర్ఎస్ వెంటే ఉన్నారని స్పష్టం చేశారు.


# జాతీయ ఉపాధి హామీ పథకం పనులకు 90 శాతం నిధులిస్తోంది కేంద్ర ప్రభుత్వమే



శాసనసభ / హైదరాబాద్ : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా ప్రజా విజయోత్సవాల్లో భాగంగా నవంబర్ 26న అన్ని గ్రామ పంచాయతీల్లో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పనులను ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం సర్క్యులర్ జారీ చేయడం ఆశ్చర్యంగా ఉందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు.. ఇవాళ ఆయన మాట్లాడుతూ..గ్రామాల్లో కొనసాగుతున్న జాతీయ ఉపాధి హామీ పథకం పనులకు 90 శాతం నిధులిస్తోంది ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆధ్వర్యం లోని కేంద్ర ప్రభుత్వమే.గ్రామాల్లోని మొక్కల పెంపకం, రైతు వేదికలు, వైకుంఠధామాలు, రోడ్ల నిర్మాణం వంటివన్నీ కేంద్రం ఇస్తోన్న ఉపాధి హామీ పథకం నిధులతో జరుగుతున్నవే. కానీ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అవి తమవిగా చెప్పుకుంటూ ఏడాది పాలనా విజయోత్సవాల పేరుతో ఉపాధి పనుల ప్రారంభించాలని ఉత్తర్వులు ఇవ్వడం విడ్డూరంగా ఉంది. సొమ్ము కేంద్రానిదైతే.. సోకు రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్నట్లుగా కాంగ్రెస్ తీరు ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలనలో చేసిందేమీ లేక కేంద్రం నిధులతో అమలవుతున్న ఉపాధి పనులను విజయోత్సవాలుగా ప్రారంభించుకోవడం సిగ్గు చేటని అన్నారు. అంతేకాకుండా..'నరేంద్ర మోదీ పాలనలో ఉపాధి కూలీలకు సమున్నత లబ్ది చేకూరుతోంది. యూపీఏ హయాంలో గ్రామీణ పేదలకు ఉపాధి దూరమైతే.. ఎన్‌డీఏ పాలనలో కోట్లాది మందికి వరంగా మారింది. గత పదేళ్లలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద ఒక్క తెలంగాణలోనే దాదాపు రూ.30 వేల కోట్ల మేరకు కేటాయించి గ్రామీణ ప్రాంతాల్లో నివసించే పేదలకు ఉపాధి కల్పిస్తూ ఆర్థికంగా ఆదుకుంటున్న ప్రభుత్వం నరేంద్రమోదీదే. ఇంత గొప్ప పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం తన ఖాతాలో వేసుకునేలా గొప్పగా ప్రకటనలు చేసుకోవడం సిగ్గుచేటు.కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా ఉపాధి హామీ పథకం పనుల ప్రారంభం సందర్భంగా ఏర్పాటు చేసే కార్యక్రమాల్లో తప్పనిసరిగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఫొటో ప్రదర్శించాలి. అంతేగాకుండా కేంద్ర ప్రభుత్వ నిధుల ద్వారా రాష్ట్రంలో అమలవుతున్న పథకాలన్నింటికీ ప్రధాన మంత్రి ఫొటో తప్పనిసరిగా ఉండేలా సర్క్యులర్ జారీ చేయాలి. తద్వారా రాష్ట్ర ప్రభుత్వం తన నిజాయితీని నిరూపించుకోవాలి. లేనిపక్షంలో కాంగ్రెస్ పార్టీ మోసాలను ప్రజాక్షేత్రంలో అడుగడుగునా ఎండగడతామని ఈ సందర్భంగా హెచ్చరిస్తున్నాం..' అని ఆయన అన్నారు.

# పాన్ కార్డు 2.0కి కేంద్ర కేబినెట్ ఆమోదం.. ప్రత్యేకత ఇదే!







శాసనసభ / హైదరాబాద్ : ఆదాయపు పన్ను శాఖకు చెందిన పాన్ 2.0 ప్రాజెక్ట్‌కు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపిందని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ సోమవారం ప్రకటించారు. ప్రధాని మోడీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది.అనంతరం కేబినెట్ నిర్ణయాలను అశ్విని వైష్ణవ్ వెల్లడించారు.పాన్‌కార్డు ఆధునీకరణకు కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. పాన్ కార్డు 2.0తో డిజిటల్ కార్డుల పంపిణీ చేయనున్నట్లు మంత్రి తెలిపారు. క్యూఆర్ కోడ్‌తో కొత్త పాన్ కార్డుల పంపిణీ చేస్తామన్నారు. పేపర్‌లెస్, ఆన్‌లైన్ విధానంలో కొత్త పాన్‌కార్డు ఉంటుందని పేర్కొన్నారు. అలాగే అటల్ ఇన్నోవేషన్ మిషన్ 2.0కు కేబినెట్ ఆమోదం తెలిపింది.అటల్ పథకానికి 2,750 కోట్ల రూపాయలు కేటాయించింది. ప్రాంతీయ భాషల్లో ఆవిష్కరణలకు ప్రోత్సాహం ఇవ్వనుంది. వన్ నేషన్-వన్ సబ్‌స్క్రిప్షన్ పథకానికి కూడా కేబినెట్ ఆమోదం తెలిపింది. సబ్‌స్క్రిప్షన్ పథకానికి రూ.6వేల కోట్లు కేటాయించారు. అరుణాచల్‌ప్రదేశ్‌లో సౌరవిద్యుత్ కేంద్రానికి కూడా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. అంతేకాకుండా సేంద్రీయ వ్యవసాయానికి ప్రోత్సాహం అందించాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. నేషనల్ మిషన్ ఆఫ్ నేచురల్ ఫార్మింగ్‌కు ఆమోదం తెలిపింది.

# బస్సుల్లో సీట్లు ఇవ్వడం లేదని.. దివ్యాంగులు చీరలు ధరించి బస్టాండ్‌లో వినూత్న నిరసన




శాసనసభ / హైదరాబాద్ / వర్ధన్నపేట, నవంబర్ 27 : బస్సులో సీట్లు ఇవ్వడం లేదని దివ్యాంగులు వినూత్న నిరసన తెలిపారు. వరంగల్ జిల్లా వర్ధన్నపేటలోని ఆర్టీసీ బస్టాండ్‌లో సోమవారం వారు చీరలు కట్టుకొని ఆందోళన చేశారు.ఈ సందర్భంగా వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేశ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహిళలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణం దివ్యాంగులకు శాపంగా మారుతున్నదన్నారు. ఉచిత ప్రయాణంతో దివ్యాంగులకు బస్సుల్లో సీట్లు దొరకడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలు తమకు సంబంధించిన సీట్లలో కూర్చోవడంతో దివ్యాంగులకు సీట్లు దొరక్క ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బస్సుల్లో దివ్యాంగులకు ప్రత్యేక సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు మహ్మద్ షరీఫ్, రాష్ట్ర బాధ్యులు కొల్లూరి ఈదయ్య, గుడిపెల్లి సుమతి, జెట్టబోయిన శ్రీనివాస్, ఇస్లావత్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్ అండ్ బీ శాఖపై సీఎం సమీక్ష.. వారిని బ్లాక్ లిస్టులో పెట్టాలని ఆదేశాలు



శాసనసభ / అమరావతి : ఆర్ అండ్ బీ శాఖపై సమీక్ష సమావేశం నిర్వహించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.. అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు.. రూ.861 కోట్లతో చేపట్టిన పాత్ హోల్ ఫ్రీ రోడ్ల నిర్మాణం సంక్రాంతి నాటికి పూర్తి చేయాలని పేర్కొన్నారు..1307 కిలోమీటర్ల పొడవైన 18 స్టేట్ హైవేలను పీపీపీ పద్ధతిలో నిర్మించేందుకు నిర్ణయం తీసుకున్నారు.. నరేగా నిధులతో గ్రామాల్లో 13 వేల కిలోమీటర్ల అంతర్గత రోడ్లు నిర్మాణం చేపట్టాలని.. పూర్తి నాణ్యతతో రోడ్ల మరమ్మతులు జరగాలని సీఎం సూచించారు.. అయితే, నాణ్యత లేకపోతే కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టాలని ఆదేశాలు జారీ చేశారు.. ప్రైవేటు సంస్థల ద్వారా రోడ్ల నాణ్యతపై నివేదికలు తెప్పించాలని కీలక సూచనలు చేశారు.రాష్ట్రంలో మొత్తం 45,378 కిలోమీటర్ల ఆర్ అండ్ బీ రోడ్ నెట్ వర్క్ లో 22,299 వేల కిలోమీటర్ల మేర మరమ్మతులు చేయాల్సి ఉందన్నారు సీఎం చంద్రబాబు.. అయితే, ఇప్పటి వరకు 1,991 కి.మీ మేర రోడ్లపై గుంతలు పూడ్చినట్లు సీఎంకు వివరించారు అధికారులు.. మరోవైపు 1,447 కి.మీ మేర రోడ్లు రిపేర్ చేయలేని స్థితిలో ఉన్నాయని.. వీటి స్థానంలో పూర్తిగా కొత్త రోడ్లు నిర్మించడానికి 581 కోట్లు ఖర్చు అవుతుందని పేర్కొన్నారు.. 23,521 కి.మీ లో జంగిల్ క్లియరెన్స్ కి 33 కోట్లు ఖర్చు అవుతుంది.. రాష్ట్రంలో మొత్తం 12,653 రాష్ట్ర హైవేలలో 10,200 కి.మీ మేర పీపీపీ పద్ధతిలో నిర్మాణం చేపట్టవచ్చు.. ప్రభుత్వం ప్రతిపాదించిన విధంగా పీపీపీ పద్ధతిలో రోడ్ల నిర్మాణం కోసం ప్రణాళికలు సిద్ధం చేయాలని తెలిపారు.. మొదటి ఫేజ్ కింద 18 రోడ్లను 1,307 కి.మీ మేర పిపిపి పద్ధతిలో నిర్మించేందుకు నిర్ణయం తీసుకున్నారు.. అయితే, డీపీఆర్ లు తయారు చేసి సాధ్యమైనంత త్వరగా పనులు ప్రారంభించాలన్న ఈ సందర్భంగా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు..

# ఖమ్మం నలుదిక్కులా మొక్కలు కనిపించేలా అధికారులు కృషి చేయాలి



శాసనసభ / హైదరాబాద్ : ఖానాపురం హవేలీ నాల్గవ డివిజన్‌లో 15వ ఆర్థిక సంఘం నిధులతో రూ. 1.43 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (జి+1 భవనం) పనులకు సోమవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా, మంత్రి మాట్లాడుతూ, "ప్రభుత్వం నుండి వచ్చిన నిధులతో అన్ని ప్రాంతాల ప్రజల అవసరాలను తీర్చేందుకు అభివృద్ధి పనులు చేపడుతున్నాం. ఎటువంటి రాజకీయ వివక్ష లేకుండా ప్రజలకు సేవలందించేందుకు కట్టుబడి ఉన్నాం" అని తెలిపారు. మేయర్ పునుకొల్లు నీరజ మాట్లాడుతూ, "నాల్గవ డివిజన్‌లో అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్థాపన చాలా అవసరమైనది. ఈ ప్రాంతంలో గ్రానైట్ ఫ్యాక్టరీలు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రజలు నివసిస్తున్నారు, వారికి ఈ ఆరోగ్య కేంద్రం ఎంతో ఉపయోగపడుతుంది" అని అన్నారు.అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, "ఈ ప్రాజెక్ట్ పనులను కాంట్రాక్టర్ నాణ్యతతో, సకాలంలో పూర్తి చేయడానికి పర్యవేక్షణ చేస్తాం" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో 4వ డివిజన్ కార్పొరేటర్ దండా జ్యోతి రెడ్డి, కార్పొరేటర్ కమర్తపు మురళీ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. బి. కళావతి బాయి, మునిసిపల్ ఇఇ లు కృష్ణాలాల్, రంజిత్, ఇతర అధికారులు పాల్గొన్నారు. వికలాంగుల హక్కుల జాతర వేదిక ఆధ్వర్యంలో సోమవారం ధర్నా కార్యక్రమం నిర్వహించబడింది. అనంతరం అదనపు కలెక్టర్ శ్రీజకు వినతి పత్రం సమర్పించారు. వికలాంగుల హక్కుల జాతీయ వేదిక అధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతూ, "తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు దివ్యంగులకు రూ. 4,000 పెన్షన్లు రూ. 6,000కు పెంచుతామని చెప్పింది. కానీ ఇప్పటివరకు ఈ హామీ అమలు కాలేదు. వెంటనే పెన్షన్ రూ. 6,000 చెల్లించాలని డిమాండ్ చేస్తున్నాం" అని చెప్పారు.

# నిందితులను కఠినంగా శిక్షించాలి :

## బిజేపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఉట్కూరి అశోక్ గౌడ్










**యాదగిరిగుట్ట నవంబర్ 27 శాసనసభ :** యాదగిరిగుట్ట మండలంలోని రామాజీపేట గ్రామంలో యాదాద్రి ఫార్మసిటి కల్స్ కంపెనీలో దొరికిన డ్రగ్స్ కేసుపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని బీజేపీ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉట్కూర్ అశోక్ గౌడ్ డిమాండ్ చేశారు.బుధవారం డ్రగ్స్ పట్టుబడ్డ కంపెనీ వద్ద బీజేపీ నేతలు నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా ఉట్కూరి అశోక్ గౌడ్ మాట్లాడుతూ యువతను మత్తుకు బానిసను చేస్తూ కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తున్న డ్రగ్స్ నిర్మూలించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. డ్రగ్స్ దొరికి తెలంగాణ రాష్ట్రంలో ఇంత అలజడి రేగినా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని, డ్రగ్స్ తరలిస్తుంటే తెలంగాణ రాష్ట్రంలో నిఘా సంస్థలు ఏం చేస్తున్నాయని ప్రశ్నించారు. డ్రగ్స్ పెద్దల హస్తం ఉందని, గత పాలకులు,ప్రస్తుత పాలకులకు కూడా దీంట్లో ప్రమేయముందని అన్నారు. డ్రగ్స్ కేసుపై వెంటనే సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని,ఈ కేసులో ఉన్న పెద్ద శక్తులను అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ రచ్చ శ్రీనివాస్,జిల్లా కార్యదర్శి కాదూరి అచ్చయ్య,బిజేపి పార్టీ పట్టణ,మండల అధ్యక్షుడు కర్రె ప్రవీణ్,గుంటిపల్లి సత్యం, మండల ప్రధాన కార్యదర్శి సంతోష్,బిజేపి నేతలు ఆకుల చంద్రమౌళి,భానుచందర్, మందోజి నరేష్,బూడిద నవీన్,సుడుగు రాజిరెడ్డి, కలుగుల సురేష్,అజయ్, శివరాత్రి శ్రీశైలం,బండకింది సాయి,గాదె వంశీ,కర్రె బీరుమల్లయ్య,కమిటికారి కృష్ణ,ప్రసాద్,నరేష్,వంశీ, శ్రీకాంత్,మహేష్,అజయ్,శివ తదితరులు పాల్గొన్నారు.

# వంగపల్లి గ్రామంలో స్కూల్ ను సందర్శించిన

## ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి




**యాదగిరిగుట్ట నవంబర్ 27 శాసనసభ :** యాదగిరిగుట్ట మండలం వంగపల్లి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి సందర్శించారు.బుధవారం ప్రభుత్వ పాఠశాలలను పరిశీలించిన ఆయన పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. పదో తరగతి వార్షిక పరీక్షలకు సిద్ధం కావాలని, మంచి జీపీఏ సాధించాలని విద్యార్థులకు సూచించారు.ఈ సందర్భంగా పాఠశాలలోని పలు సమస్యలను ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి దృష్టికి ప్రధానోపాధ్యాయులు ఎన్.కృష్ణారెడ్డి తీసుకెళ్లారు. పాఠశాలలో అదనపు తరగతి గదులను మంజూరు చేయించాలని,మధ్యాహ్నం భోజన కార్మికులకు బిల్లులు వెంటనే వచ్చే విధంగా చూడాలని, విద్యార్థులకు అందించే రైస్ క్వాంటిటీ పెంచాలని, కాంప్లెక్స్ పాఠశాలకు ఆఫీస్ సబార్డినేట్ పోస్టును మంజూరు చేయించాలని,పెండింగ్ లో ఉన్న బిల్లులను మంజూరు చేయించాలని కోరారు. పాఠశాలలోని సమస్యలన్నీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని,సమస్యలు పరిష్కారమయ్యేలా కృషి చేస్తానని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి తెలిపారు.ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచుకోవడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఆయన వెంట టీఎస్ యూటిఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యుడు మెతుకు సైదాలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# దేవునిపల్లి డబుల్ బెడ్ రూమ్ కాలనీలో బాల్య

## వివాహాలపై కొవ్వొత్తుల ప్రతిజ్ఞ ప్రోగ్రాం




**శాసనసభ కామారెడ్డి జిల్లా నవంబర్ 27 :** కామారెడ్డి పట్టణంలోని దేవునిపల్లి డబుల్ బెడ్ రూమ్ కమ్యూనిటీ కాలనీలో సాధన సంస్థ ఆధ్వర్యంలో చైల్డ్ మ్యారేజ్ ఫ్రీ భారత్ బాల్య వివాహ నిరోధక క్యాంపెయిన్ కార్యక్రమం సంస్థ డైరెక్టర్ చిక్కు మురళీమోహన్ మరియు కమ్యూనిటీ సోషల్ మొబిలైజర్ విశ్వ జ్యోతి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. కాలనీవాసులతో కొవ్వొత్తుల ప్రదర్శన మరియు ప్రతిజ్ఞ ప్రోగ్రాం నిర్వహించారు.బాల్య వివాహాలపై అవగాహన కల్పించి, బాల్య వివాహాలు నిర్వహిస్తే 1098కు సంప్రదించాలన్నారు.బాల్య వివాహాలు నిర్వహిస్తే వాటిపై ఏర్పడే ప్రభావం, చట్టాలపై అవగాహన తల్లిదండ్రులు కలిగి ఉండాలన్నారు. 18 సంవత్సరాల వయస్సు పైబడిన ఆడపిల్లలకు మాత్రమే పెళ్లిళ్లు జరిపించాలని లేదంటే చట్టరీత్యా కఠినమైన చర్యలు ఉంటాయని తెలిపారు.

# కామారెడ్డి జిల్లా కేంద్రాన్ని

## ఎడ్యుకేషన్ హావుగా మార్చాలి

### రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల పిలుపు




**శాసనసభ కామారెడ్డి జిల్లా నవంబర్ 27 :** కామారెడ్డి జిల్లా కేంద్రాన్ని ఎడ్యుకేషనల్ హాఫ్ గా మార్చాలని విద్యార్థి సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరైన వక్తలు మాట్లాడుతూ..జిల్లా అభివృద్ధిలో భాగంగా విద్యారంగాన్ని మరింత పటిష్టం చేయాలని అన్నారు.సౌత్ క్యాంపస్‌ను కామారెడ్డి జిల్లా యూనివర్సిటీగా ఏర్పాటు చేయాలన్నారు.ఇంజనీరింగ్ ,పాలిటెక్నిక్, ఐటిఐ,మెడికల్,నర్సింగ్,లా కాలేజీ, కేంద్రీయ విద్యాలయ,టిటిసి,బీఈడీ,ఎంఈడి, దోమకొండ మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల, జిల్లా కేంద్రంలో మహిళ డిగ్రీ కాలేజ్, ఏర్పాటుచేసి విద్యాభివృద్ధి జరిగేలా చూడాలన్నారు.ఇవే కాకుండా కామారెడ్డి పట్టణ సమస్యలైన మార్కెట్లో రైతుల నుండి వసూలు చేసే తైబజార్ పన్ను ఎత్తివేయాలి అన్నారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ షెడ్ల నిర్మాణాన్ని పూర్తిస్థాయిలో కంప్లీట్ చేయాలని ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని, సెకండ్ ఫ్లై ఓవర్ నిర్మాణం చేపట్టాలని తదితర డిమాండ్ లు చేశారు. కామారెడ్డి ఎమ్మెల్యే తన సొంత మేనిఫెస్టో ద్వారా విద్యాభివృద్ధి చేస్తానని చెప్పిన విషయంలో ఉన్నటువంటి ప్రొఫైల్స్ పాఠశాలను ప్రభుత్వ మోడల్ స్కూల్ గా తీర్చిదిద్ది వేలాదిమంది విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్యను అందించాలని కోరారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో కేంద్ర ప్రభుత్వం ద్వారా క్యాన్సర్ ఆసుపత్రిని కూడా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ఇద్దరు జిల్లా అభివృద్ధికి సహకరించాలని అన్నారు. ప్రోటోకాల్ సమస్యను తెరమీదకి తీసుకువచ్చి అభివృద్ధిని అడ్డుకుంటామంటే ఇద్దరు నాయకుల్ని కామారెడ్డి జిల్లా ప్రజలు సహించేది లేదని స్పష్టం చేశారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో జేఏసీ కన్వీనర్ జగన్నాథం, బహుజన ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ క్యాతం సిద్ధిరాములు, ఏపీటీఎఫ్ మాజీ రాష్ట్ర అధ్యక్షులు వేణుగోపాల్, సిపిఐ రాష్ట్ర సీనియర్ నాయకులు, మాజీ జెడ్పిటిసి సభ్యులు కొత్తపల్లి మల్లన్న, బీసీ సంఘం జిల్లా అధ్యక్షులు సాప శివరాం, అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు గంగారం, బీడీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎల్ ఎన్ ఆజాద్, ఎన్ఎస్ యు ఐ జిల్లా అధ్యక్షులు ఐరేని సందీప్, బి వి ఎం రాష్ట్ర కార్యదర్శి జీవీఎం విటల్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముదాం అరుణ్, పి డి ఎస్ యు జిల్లా అధ్యక్షులు సతీష్, జి వి ఎస్ జిల్లా అధ్యక్షులు వినోద్, నాయకులు మణికంఠ భరత్ టింకు ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రభుత్వం సమాచారం ఇవ్వకపోవడం

## వల్లే ఎన్‌డీఎస్ఏ నివేదిక ఆలస్యం..



**శాసనసభ న్యూస్ / హైదరాబాద్ :** కాళేశ్వరం కమిషన్ ఛైర్మన్ జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ ముందు కేంద్ర జలశక్తి శాఖ సలహాదారు వెదిరే శ్రీరామ్ హాజరయ్యారు.కాళేశ్వరం బ్యారేజీలకు సంబంధించిన అంశాలపై అఫిడవిట్ సమర్పించారు. అవసరమైన పరీక్షలు పూర్తి చేసి రాష్ట్ర సర్కారు వివరాలు అందించకపోవడం వల్లే కాళేశ్వరం బ్యారేజీలకు సంబంధించిన ఎన్డీఎస్ఏ నిపుణుల కమిటీ నివేదిక ఆలస్యం అవుతోందని కేంద్ర జలశక్తి శాఖ సలహాదారు వెదిరే శ్రీరామ్ వెల్లడించారు."కాళేశ్వరం కమిషన్ ముందు అఫిడవిట్ దాఖలు చేశాను. నా దగ్గర ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను అఫిడవిట్ రూపంలో దాఖలు చేశాను. NDSA రిపోర్ట్ అంశాన్ని కమిషన్ చీఫ్ నాతో మాట్లాడారు. ప్రాజెక్టులో గుంతలను స్టేట్ ఇంజనీర్లు పూడ్చడంతో జియోటెక్నికల్, జియోగిజికల్ డేటా కోల్పోయాం. జియోఫీజికల్ టెస్టుల కోసం NDSA రాష్ట్ర ప్రభుత్వాన్ని పలు వివరాలను అడిగితే అది రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వలేదు. NDSA అడిగిన సమాచారం రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వకపోవడం వల్లే NDSA నివేదిక ఆలస్యం అవుతుంది." అని కేంద్ర జలశక్తి సలహాదారు వెదిరె శ్రీరామ్ పేర్కొన్నారు.ఇంజనీర్లపై కాళేశ్వరం కమిషన్ చీఫ్ జస్టిస్ చంద్రగోష్ కీలక వ్యాఖ్యలు చేశారు. "నిజాలు దాచినా? నిజాలను బైపాస్ చేసినా? మేము బయటకు తీస్తాం. నిజాలను దాచి బైపాస్ చేసే ప్రయత్నం చేస్తే నేనే స్వయంగా చర్యలు తీసుకుంటా. జరిగిన– చూసిన చేసిన పనిని గురించి చెప్పడానికి ఎందుకంత బయం బైపాస్ చేస్తున్నారు ఎలా మర్చిపోతారు. రాష్ట్రస్థాయిలో జరిగిన విషయాలను కేంద్రంపై బకెట్ షిఫ్ట్ చేసే ప్రయత్నం చెయ్యొద్దు. అఫిడవిట్‌లో చెప్పిన చేర్చిన అంశాలు ఫీల్డ్‌లో కనిపించడం లేదు.ఇంజనీర్లు డెడికేషన్ తో పనిచేస్తే ఎందుకు బ్లాకులు కొట్టుకు పోయాయి." అని ఇంజనీర్లను కమిషన్ ప్రశ్నించింది.

# వేల సంఖ్యలో బైక్లతో భారీ ర్యాలీని నిర్వహించనున్నాం

**శాసనసభ / హైదరాబాద్ :** తెలంగాణ భవన్లో ఈ నెల 29వ తేదీన నిర్వహించే దీక్షా దివస్ కార్యక్రమానికి సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వేల సంఖ్యలో బైక్లతో భారీ ర్యాలీని నిర్వహించనున్నట్లు సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుల్ల పద్మారావు గౌడ్ బుధవారం తెలిపారు.సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్ఎస్ కార్పొరేటర్లు, ముఖ్య నేతలతో సీతాఫాల్మండీలో అత్యవసర సమావేశం నిర్వహించారు. సుమారు 3 వేల బైక్ లతో ర్యాలీ గా బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ సర్కిల్ వద్దకు చేరుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. అక్కడి నుండి ర్యాలీగా తెలంగాణ భవన్ కు చేరుకొని అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొనాలని తెలిపారు. తెలంగాణ భవన్ లో జరిగే దీక్షా దివస్ లో రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల నుండి పార్టీ శ్రేణులు పాల్గొంటారని చెప్పారు.

# నారాయణపుర్ లో ఎస్సీ హాస్టల్లో రాత్రి బస చేసిన యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు....

## విద్యార్థులకు అందించే భోజన విషయంలో రుచి,శుచి,శుభ్రత పాటించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు.







**శాసనసభ / యాదాద్రి భువనగిరి :** బుధవారం నారాయణపుర్ మండలంలోని ఎస్సీ బాలుర హాస్టల్( ప్రీమెట్రిక్ )విద్యార్థులతో కలిసి రాత్రి బస చేశారు. సాయంత్రం ఐదు గంటలకు హాస్టల్ కు చేరుకున్న కలెక్టర్..విద్యార్థులను పలకరించి వారికి అందిస్తున్న భోజనం, రోజువారి దినచర్య గురించి కలెక్టర్ ఆరా తీశారు.హాస్టల్ పరిసరాలను, వంట గదిని, పిల్లలు చదువుతున్న విధానాన్ని, కూరగాయలను, రోజు వారి మెనూను , విద్యార్థులు ఉండే గదులను, మరుగు దొడ్లను కలెక్టర్ పరిశీలించారు. వంట గది ని కలెక్టర్ పరిశీలించారు. వంట తయారు చేసే విధానాన్ని కలెక్టర్ స్వయంగా పర్యవేక్షించారు.అనంతరం విద్యార్థులతో కలిసి మీకు ఏమైనా సమస్యలు ఉన్నాయా అడిగి తెలుసుకున్నారు. స్టాక్ రిజిస్టర్ ను పరిశీలించి, స్టోర్ రూం లో ఉన్న కందిపప్పు, బియ్యం , చింతపండు, కారం , ఉప్పు, గుడ్లు, కూరగాయలు తదితర వంట సరుకులను కలెక్టర్ స్వయంగా తనిఖీ చేశారు. నాసిరకం బియ్యం,కూరగాయలు , ఇతర ఆహార పదార్థాలు సరఫరా చేసినట్లయితే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని, నాణ్యమైన సరుకులు మాత్రమే వాడాలని నాణ్యమైన సరుకులు వాడని పక్షంలో చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. విద్యార్థులకు అందించే భోజన విషయంలో నిర్లక్ష్యానికి తావిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని,ఏ చిన్న ఫిర్యాదు వచ్చిన ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.ఎక్కువ కాలం నిల్వ ఉంచిన , పురుగుపట్టి తేది అయిపోయిన సరుకులను ఉపయోగించరాదని, మెనూ ప్రకారం భోజనం అందిస్తున్న తీరును కలెక్టర్ పరిశీలించారు. వంటకు వాడే నీటిని ట్యాంక్ నుండి వాడుతున్నారా లేదా ఆర్ ఓ వాటర్ ప్లాంట్ నుండి నీటిని వాడుతున్నారా అని ఆరా తీశారు.. అనంతరం విద్యార్థులతో భోజనం చేస్తూ వారి విద్య విధానంలో ఎదురవుతున్న సమస్యలు , వాటి పరిష్కారానికి కావలసిన సలహాలు ,సూచనలు విద్యార్థులకు వివరించారు. విద్యార్థులతో మమేకం అయ్యి వారి అభ్యాసన సామర్థ్యాలను రాబట్టారు.రోజు ఉదయం ఎన్ని గంటలకు లేస్తున్నారు? మీ దిన చర్య ఏంటి? ఎంత మంది మీలో 10/10 జి పి ఏ సాధిస్తారు? అని కలెక్టర్ విద్యార్థులను అడిగారు. బాగా చదుతున్నమని, 10/10 జిపిఏ సాధిస్తామని కలెక్టర్ తెలిపారు.. సిలబస్ ను సకాలంలో పూర్తి చేయాలనీ, ప్రత్యేక తరగతులు నిర్వహించాలని పదవ తరగతిలో ఈసారి 100% ఫలితాలు సాధించే విధంగా కృషి చేయాలని అధికారులకు సూచించారు. విద్యార్థులందరికీ కలెక్టర్ ఆల్ ద బెస్ట్ అని తెలిపారు.విద్యార్థులు ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను శ్రద్ధగా వినాలని విద్యార్థులకు సూచించారు.మంచిగా చదువుకుంటేనే భవిష్యత్ ను ఉన్నతంగా తీర్చి దిద్దుకోవచ్చునని, ఉన్నత స్థానాలను అధిరోహించి, మీ తల్లిదండ్రులకు, మీ ఊరికి మంచి పేరు తీసుకొని రావాలని హిత బోధ చేశారు.మీ తల్లిదండ్రులు మీ మీద ఎన్నో ఆశలు పెట్టుకొని ఉంటారని,వారి కలలను నిజం చేసి భవిష్యత్తులో మంచిగా సెటిల్ అవ్వాలని కలెక్టర్ అన్నారు.విద్యార్థులకు చదువు అందించడంతో పాటు వారి ఆరోగ్యం పట్ల కూడా అలర్ట్ గా ఉండాలన్నారు. తల్లిదండ్రులకు దూరంగా ఉంటూ చదువుతున్న నిరుపేద విద్యార్థులను మన బిడ్డలుగా భావించి వారిని మరింత జాగ్రత్తగా చూసుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని గుర్తించాలన్నారు. సిబ్బంది మరియు విద్యార్థుల హాజరు రిజిస్టర్ను పరిశీలించారు.చలి తీవ్రత ఎక్కువగా ఉన్నందున విద్యార్థులకు దుప్పట్లను, కుర్చీలను కలెక్టర్ పంపిణీ చేయడం జరిగింది..నాణ్యత ప్రమాణలను పాటిస్తూ , మంచి రుచి కరమై భోజనం పెట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వార్డెన్ లు తప్పనిసరిగా హాస్టల్ లోనే ఉండాలన్నారు. హాస్టల్ కి రాని విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి హాస్టల్ కి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ రెవిన్యూ డివిజనల్ అధికారి శేఖర్ రెడ్డి, జైపాల్ రెడ్డి,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన గోలి నరేందర్ రెడ్డి



**బీబీనగర్ నవంబర్ 27(శాసనసభ) :** బీబీనగర్ పట్టణ కేంద్రానికి చెందిన శ్రీమతి&శ్రీ మిట్టకంటి రాణి – బుచ్చి రెడ్డి గార్ల పుత్రిక సుప్రియ – భానుచందర్ రెడ్డి వివాహం ఈరోజు బీబీనగర్ PRG గార్డెన్స్ లో నిర్వహించగా, వివాహ వేడుకకు ముఖ్య అతిధి గా హాజరు అయ్యి, నూతన వధూవరులను ఆశీర్వదించిన గోలి సునీత – నరేందర్ రెడ్డి. కార్యక్రమం లో రాజి రెడ్డి, బాలరెడ్డి, శివారెడ్డి, తుమ్మల నితిన్ రెడ్డి, ఉప్పు సందీప్ రెడ్డి, బండారి సందీప్ కుమార్, తుమ్మల సందీప్ రెడ్డి,ఉప్పు నరేష్ రెడ్డి, ఏంపల రాకేష్ రెడ్డి, గోపి రెడ్డి, శివ,తుమ్మల రవీందర్ రెడ్డి, మిత్తకాంటి మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొనటం జరిగింది.

## సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయండి




**యాదగిరిగుట్ట నవంబర్ 27 శాసనసభ :** వచ్చే నెల 15,16,17 తేదీల్లో చౌటుప్పల్ మండల కేంద్రంలో జరిగే సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి, కార్యవర్గ సభ్యుడు మంగ నర్సింహులు పిలుపునిచ్చారు.బుధవారం యాదగిరిగుట్ట మండలం పెద్దకందుకూరు గ్రామం లో మహా సభలకు సంబంధించి వాల్ రైటింగ్ రాయించిన సందర్భంగా మంగ నర్సింహులు మాట్లాడుతూ యాద్రాది భువనగిరి జిల్లా వ్యాప్తంగా అనేక ప్రజా పోరాటాలను సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించామన్నారు.ప్రజలు ఎదుర్కొంటున్న సాగు,తాగు నీటి సమస్య,మూసీ కాలువ,పరిశ్రమల కాలుష్యంతో పాటు అనేక సమస్యలపై సీపీఎం పోరాటాలు నిర్వహించిందని అన్నారు.గత బీఆర్ఎస్, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రజా ప్రయోజనాలను పక్కన బెట్టి అధికారం,కమీషన్ల కోసమే పరిపాలించారని విమర్శించారు.ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి బబ్బూరి పోశెట్టి,డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గడ్డం వెంకటేష్, పెద్దకందుకూరు మాజీ సర్పంచ్ భీమగాని మాధవి రాములుగౌడ్, నాయకులు కాలె స్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణపై వ్యతిరేకంగా మాలాల సింహగర్జన




**శాసనసభ కామారెడ్డి జిల్లా నవంబర్ 27 :** బుధవారం ఎల్లారెడ్డి నియోజకవర్గ కేంద్రంలో డిసెంబర్ 1వ తారీఖున ఎస్సీ వర్గీకరణపై వ్యతిరేకంగా మాలల సింహగర్జన కార్యక్రమం ఉన్నందున కామారెడ్డి జిల్లా యువజన మల సంఘం అధ్యక్షులు జువ్వాడి వినయ్ కుమార్ ఆధ్వర్యంలో మరియు అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షులు గుర్రం మోహన్ నేతృత్వంలో కరపత్రాలు ఎల్లారెడ్డి నియోజకవర్గ కేంద్రంలో ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎడ్ల కిషన్, చంద సాయిలు, సంజీవులు, సుదర్శన్, దత్తు, గంగాధర్, శ్రీనివాస్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## 108 అంబులెన్స్ లో ప్రసవం



**శాసనసభ కామారెడ్డి జిల్లా నవంబర్ 27 :** జిల్లాలోని తాడ్వాయి మండలం చిట్యాల గ్రామానికి చెందిన, సావిత్రి వయస్సు 26 ఆమెకి పురిటి నొప్పులు రావడంతో రాత్రి వేళ 108 అంబు లెన్స్ కు ఫోను చేయగా.. అంబులెన్స్ సిబ్బంది అక్కడికి చేరు కోగా, ఆమెకి పురిటి నొప్పులు ఎక్కువ అవడంతో ఆసుపత్రికి తరలిస్తుండగా, మార్గ మధ్యలో..దేవాయి పల్లి గ్రామ సమీప ంలో, ఆమె కు అంబులెన్స్ లోనే ప్రసవం చేశారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో 108 అంబులెన్స్ సిబ్బంది సాధారణ ప్రసవం చేసి తల్లి, బిడ్డ లను కాపాడినారు. రెండవ కాన్పు కావడంతో పండంటి అడ బిడ్డ జన్మించినది. తల్లి, బిడ్డలు క్షేమం గా ఉన్నారని, తదుపరి వైద్యసేవల నిమిత్తం జిల్లా జనరల్ ప్రభుత్వ ఆసుపత్రి కామారెడ్డి లో చేర్పించినట్లు సిబ్బంది తెలిపారు. 108 అంబులెన్సు సిబ్బంది ఈఎంటి – అల్లె సురేష్, పైలట్– బుక్య కార్తీక్ లకు.. ఆమె భర్త సాయిలు కృతజ్ఞతలు తెలిపారు.

## డిసెంబర్ 15, 16, 17 తేదీల్లో సిపిఎం జిల్లా మహాసభను జయప్రదం చేయండి

### - సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నరసింహ పిలుపు




**బీబీనగర్ నవంబర్ 27(శాసనసభ) :** డిసెంబర్ 15, 16, 17 తేదీల్లో చౌటుప్పల్ లో జరుగు సిపిఎం జిల్లా 3వ మహాసభల ప్రజలంతా సహకరించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నరసింహ కోరారు.బుధవారం రోజున పార్టీ సీనియర్ నాయకులు ఎరుకలి బిక్షపతి అధ్యక్షతన జరిగిన మండల కమిటీ సమావేశంలో నరసింహ పాల్గొని మాట్లాడుతూ చౌటుప్పల్ లో జరిగే జిల్లా మహాసభల సందర్భంగా డిసెంబర్ 15న వేలాది మందితో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇట్టి మహాసభల్లో గత మూడు సంవత్సరాలుగా జిల్లాలో చేసిన ప్రజా ఉద్యమాలను సమీక్షించుకొని భవిష్యత్తు పోరాట కార్యక్రమాలను రూపొందించుకోవడం జరుగుతుందని తెలిపారు. జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం చిన్న నీటి కాలువలు, బస్వాపురం రిజర్వాయర్ పనులు పూర్తి చేయడం కోసం తగినన్ని నిధులు కేటాయించాలని సిపిఎం చేసిన పోరాటాల ఫలితంగా ప్రభుత్వంలో కదలిక వచ్చిందన్నారు. ఎయిమ్స్ హాస్పిటల్ సరిత గతిన అన్ని రకాల వైద్యాన్ని అందుబాటులోకి తేవాలని అన్నారు. మూసి విషపు నీరు నుండి ఈ ప్రాంత రైతులను, ప్రజలను విముక్తి చేయాలన్నారు. స్థానిక పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వాలని, పరిశ్రమల కాలుష్యాన్ని అరికట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లాలో సిపిఎం చేపట్టిన ఇంటింటికి సిపిఎం కార్యక్రమాన్ని ప్రజలంతా ఆదరించాలని కోరారు. ప్రభుత్వం చెప్పిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని అన్నారు. అన్ని రకాల పెన్షన్స్ ను రెట్టింపు చేసి అమలు చేయాలన్నారు. రైతు భరోసా కింద రెండు సీజన్లకు సంబంధించి 15వేల రూపాయలను తక్షణమే రైతుల ఖాతాల్లో జమ చేయాలన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కోమటిరెడ్డి చంద్రారెడ్డి, పార్టీ మండల కార్యదర్శి గాడి శ్రీనివాస్, నాయకులు కందాడి దేవేందర్ రెడ్డి, సయ్యద్ ఉమర్, మంద కిరణ్, మేకల బాబు తదితరులు పాల్గొన్నారు.

## హామీలు అమలు చేయకుండా విజయోత్సవాలు సిగ్గుచేటు : బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దాసరి మల్లేషం



**యాదగిరిగుట్ట నవంబర్ 27 శాసనసభ :** కాంగ్రెస్ అధికారంలోకి రాకముందు 6 గ్యారంటీలు, 420 హామీలు ఇచ్చిందని, ఇచ్చిన హామీలు అమలు చేయకుండా విజయోత్సవాలు నిర్వహించడం సిగ్గుచేటని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దాసరి మల్లేశం విమర్శించారు.బుధవారం యాదగిరిగుట్ట పట్టణంలో పడాల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఆ పార్టీ ఆలేరు నియోజకవర్గ స్థాయి విస్తృతస్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 30 నుండి నిరసన కార్యక్రమాలు నిర్వహిం చనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో బీజేపీ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉట్కూర్ అశోక్ గౌడ్, జిజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిత్రజనరెడ్డి,జిల్లా



ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, జిజేపి నేతలు కానుగంటి శ్రీనివాస్ రెడ్డి,కాదూరి అచ్చయ్య,రచ్చ శ్రీనివాస్ రెడ్డి,చిరిగె శ్రీను,దాచేపల్లి శ్రీను, బొట్టు కృష్ణ,మాధురి రాజేందర్ రెడ్డి,కర్రె ప్రవీణ్,గుంటిపల్లి సత్యం,గజరాజు కాశీనాథ్, కుమారస్వామి,కృష్ణ, శత్రునాయక్,గంగేష్ తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక సేవతో ఆదర్శంగా నిలుస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు జమీల్

### ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్,రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు

**శాసనసభ కామారెడ్డి జిల్లా నవంబర్ 27 :** కేంద్రంలోని ప్రైవేటు వైద్యశాలలో అనీమియా వ్యాధితో బాధపడుతున్న లక్ష్మీ (62) మహిళకు ( బి పాజిటివ్ ) రక్తం అవసరం కావడంతో కామారెడ్డి రక్తదాతల సమూహ ఉపాధ్యక్షుడు,రెడ్ క్రాస్ డివిజన్ సెక్రెటరీ ప్రభుత్వ ఉపాధ్యాయులు జమీల్ 27వ సారి రక్తదానం చేసి మానవత్వాన్ని చాటడం జరిగిందని ఐవీఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్,రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బాలు మాట్లాడుతూ ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా విధులను నిర్వహించడమే కాకుండా సామాజిక సేవలో భాగంగా ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేస్తూ తల సేమియా వ్యాధితో బాధపడు తున్న చిన్నారులకు కావలసిన రక్తాన్ని అందజేయడం కోసం నిర్వహిస్తున్న రక్తదాన శిబిరాలకు సహాయ సహకారాలను అందిస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు జమీల్ సేవలు అభినందనీయమని వీరిని స్ఫూర్తిగా తీసుకొని మరింత మంది ప్రభుత్వ ఉద్యోగులు రక్తదానానికి ముందుకు రావాలని,27వ సారి రక్తదానం చేసినందుకు ఐవీఎఫ్ జాతీయ వర్కింగ్




ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కామారెడ్డి రక్తదాతల సమూహ ఉపాధ్యక్షులు డాక్టర్ పుట్ల అనిల్ కుమార్, సలహాదారులు వెంకటరమణలు పాల్గొనడం జరిగింది.

## సదాశివ నగర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ అజ్మల్ ఖాన్ పదవి విరమణ వేడుకలు



**శాసనసభ కామారెడ్డి జిల్లా నవంబర్ 27 :** సదాశివ నగర్ మండల్ సదాశివనగర్ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ గా విధులు నిర్వహిస్తున్న అజ్మల్ ఖాన్ నేడు పదవి విరమణ చేపట్టారు. ఈ సందర్భంగా అజ్మల్ ఖాన్ మాట్లాడుతూ 2017లో సదాశివ నగర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ గా పదవీ బాధ్యతలు చేపట్టి కళాశాలలో ప్రతి విద్యార్థికి క్రమశిక్షణ మరియు ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డు కూడా అందుకోవడం గౌరవంగా ఉందని, అంతేకాకుండా ప్రతి ఒక్క విద్యార్థి కష్టపడి చదవాలని, తల్లిదండ్రులకు గురువులకు పేరు తీసుకురావాలని, ఆయన ఆకాక్షించారు. మరి సదాశివ నగర్ పత్రిక విలేకరులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి ఒక్క ప్రోగ్రామ్ అయినా న్యూస్ కవరేజ్ చేయడంలో నాకు తోడ్పడడం నాకు ఇంత గుర్తింపు రావడం పత్రిక విలేకరులకే చెందుతుందని ఆయన అన్నారు ఉపాధ్యాయులు ప్రతి ఒక్కరు నాకు సహకరించడంతోపాటు ఇంత గొప్ప స్థాయి నాకు పదవి విరమణ పొందుతున్న అందుకు గౌరవంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ షేక్ సలీమ్, వివిధ మండల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## బేసిక్ పే ప్రకటించాలి

### - కేజీబీవీ రాష్ట్ర కోశాధికారి మంజుల






**శాసనసభ / డోర్నకల్ (కురవి) :** కేజీబీవీ,యుఆర్ఎస్ కాంట్రాక్ట్ ఉద్యోగులకు బేసిక్ పే ప్రకటించాలని టీఎస్ యుటిఎఫ్ కేజీబీవీ,యుఆర్ఎస్ రాష్ట్ర కోశాధికారి ఎం.మంజుల ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు.రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మధ్యాహ్న విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. దశలవారీగా ఉద్యమించనున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ మున్ని,కురవి స్పెషల్ ఆఫీసర్ సరస్వతి,ఉపాధ్యాయులు సుధా,శ్యామల,జ్యోతి,శ్రీదేవి,లక్ష్మీకాంత,ఫరీదా,కృష్ణవేణి,స్వాతి,శ్రీలత,శ్రీదేవి, సౌజన్య, కళావతి,సుహాసిని,వాణి,పవిత్ర,శైలజ తదితరులున్నారు.

## ప్రజాపాలన విజయోత్సవాలు





**రాజాపేట, నవంబర్ 27 శాసనసభ :** రాజాపేట మండలంరేణికుంట బేగంపేట నర్సాపురం లో ప్రజా పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను బుధవారం కళాకారులు ఆటపాటలతో వివరిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తైన సందర్భంగా ప్రజా పాలన రాజపేట మండల బేగంపేట రేణిగుంట నర్సాపురం గ్రామాలలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలనలో ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను వివరించి చెబుతున్న మండల పార్టీ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి నేతృత్వంలోని బృందం ఈ సందర్భంగా ప్రజల నుండి మంచి స్పందన ఆదరణ కనబరుస్తున్నారువారోత్సవాలు నిర్వహిస్తున్నారు. గృహ జ్యోతి, మహాలక్ష్మి పథకాలను ప్రజలకు వివరిస్తూ ప్రజాపాలన కళాయాత్ర నిర్వహించారు. ఈ కార్య క్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

## రాష్ట్ర వ్యాప్తంగా 95 శాతం సర్వే పూర్తి



**శాసనసభ / హైదరాబాద్ :** సామాజిక, ఆర్థిక, విద్యా, ఉద్యోగ, రాజకీయ, కుల గణన సర్వే బుధవారం నాటికి రాష్ట్ర వ్యాప్తంగా 95 శాతం పూర్తయింది. ఈ సమగ్ర ఇంటింటి సర్వేలో మొత్తం 1,18,02,726 నివాసాలను గుర్తించారు.బుధవారం నాటికి 1,10,98,360 నివాసాలలో సమాచార సేకరణ పూర్తవగా.. కేవలం 7,04,366 నివాసాల సర్వే సమాచారాన్ని మాత్రమే సేకరించాల్సి ఉంది. సేకరించిన వివరాలను అధికారులు కంప్యూటరీకరించడంలో పూర్తి జాగ్రత్తలు తీసుకొంటూ వేగవంతంగా సమాచారాన్ని కంప్యూటరీకరిస్తున్నారు. ఈ ప్రక్రియనంతా సంబందిత ఉన్నతాధికారులు నేరుగా పర్యవేక్షిస్తున్నారు.అత్యధికంగా 70.3 శాతం సమాచారాన్ని కంప్యూటరీకరించి ములుగు జిల్లా మొదటి స్థానంలో నిలవగా.. 59.8 శాతం సమాచారాన్ని కంప్యూటరీకరించి యాదాద్రి భువనగిరి జిల్లా రెండవ స్థానంలో ఉంది. రాష్ట్రవ్యాప్తంగా నేటి వరకు సేకరించిన సమాచారంలో 29,82,034 నివాసాల సర్వే సమాచారాన్ని కంప్యూటరీకరించారు. జీహెచ్ఎంసీ పరిధిలో కూడా సర్వే ప్రక్రియ ఊపందుకుంది. 25,05,517 నివాసాలు సర్వే చేయాల్సి ఉండగా.. నేటి వరకు 20,15,965 నివాసాలలో సర్వే పూర్తి చేసి 80.5 శాతానికి చేరుకుంది. రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారుల పర్యవేక్షణలో కంప్యూటరీకరణ ప్రక్రియ కొనసాగుతోంది. సర్వే పత్రాలను సమగ్రంగా భద్రపరచడమే కాకుండా తప్పులు లేకుండా ఆన్ లైన్‌లో నమోదు చేసేందుకు పకడ్బందీ చర్యలు చేపడుతున్నారు.

## రైతు పండుగ.. రైతులకు అవగాహన కల్పించేలా వేడుకలు



**శాసనసభ / మహబూబ్‌నగర్ :** మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంగా రాష్ట్ర ప్రభుత్వం మూడు రోజుల పాటు రైతు పండుగను నిర్వహిస్తోంది. అన్ని జిల్లాల రైతులు ఈ వేడుకల్లో పాలుపంచుకునేందుకు వ్యవసాయ శాఖతో పాటు అనుబంధ శాఖలన్నీ భారీగా ఏర్పాట్లు చేస్తున్నాయి.రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, లాభసాటి విధానాలు, వివిధ పంట ఉత్పత్తులపై అవగాహన కల్పించేందుకు ఈ సందర్భంగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తారు. రైతు సదస్సులో భాగంగా 25 వివిధ విభాగాల అధ్వర్యంలో 150 స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలతో పాటు వివిధ జిల్లాల నుంచి ఆదర్శ రైతులు ఈ సదస్సులో పాలుపంచుకుంటారు. యూనివర్సిటీలతో పాటు వ్యవసాయ, అనుబంధ శాఖలన్నీ ఇందులో పాల్గొంటాయి. తెలంగాణ రైతులు దేశానికే ఆదర్శంగా ఉండేలా.. రైతుల సంక్షేమం, అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం తొలి ఏడాదిలోనే భారీగా నిధులు ఖర్చు చేసింది. దాదాపు రూ.54280 కోట్లతో వివిధ పథకాలను అమలు చేసింది.దేశంలోనే వరిసాగు విస్తీర్ణంలో తెలంగాణ నెంబర్ వన్ స్థానాన్ని నిలబెట్టుకుంది. 66.77 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా గతంలో ఎన్నడూ లేని విధంగా 153 లక్షల టన్నుల దిగుబడి వచ్చింది. దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా రైతులకు ఒకే సారి రూ. 2 లక్షల వరకు పంట రుణాలు మాఫీ చేసింది. కేవలం 27 రోజుల్లోనే దాదాపు 22.22 లక్షల మంది రైతుల కుటుంబాలకు దాదాపురూ.17,870 కోట్ల రుణమాఫీ నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసింది. అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేస్తామని ఇటీవలే వేములవాడ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు.అధికారం చేపట్టిన వెంటనే రైతులను బాగు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం వివిధ పథకాలను అమలు చేసింది. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి అమల్లోకి తెచ్చిన వ్యవసాయానికి ఉచిత విద్యుత్తు పథకాన్ని నిరాటంకంగా ప్రజా ప్రభుత్వం కొనసాగించింది. రైతులకు ఇచ్చే ఉచిత విద్యుత్తుకు ఈ ఏడాది రూ.10444 కోట్లు సబ్సిడీగా చెల్లించింది. ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి అధికారం చేపట్టిన తొలి మూడు నెలల్లోనే ప్రభుత్వం రైతు భరోసా నిధులను పంపిణీ చేసింది. యాసంగి సాగుకు పెట్టుబడి సాయంగా రైతు భరోసా నిధులను ఎకరానికి రూ. 5 వేల చొప్పున రైతులందరి ఖాతాలో జమ చేసింది. మొత్తం 1,57,51,000 ఎకరాలకు రూ.7625 కోట్ల నిధులను విడుదల చేసింది. మొత్తం 69,86,519 మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో ఈ నిధులు జమ చేసింది. గతంలో ఎన్నడూ లేనంత వేగంగా రైతు భరోసా నిధులను మే నెల మొదటి వారంలోనే జమ చేసింది.ప్రకృతి విపత్తులతో, క్రిమికీటకాలతో పంటలు నష్టపోతే రైతులు ఇబ్బంది పడకుండా.. నష్ట పరిహారం అందేలా పంటల బీమా పథకాన్ని పునరుద్ధరించింది. రాష్ట్రంలోని రైతుల తరఫున పంటల బీమా ప్రీమియం చెల్లించేందుకు రూ. 1,300 కోట్లు కేటాయించింది. రైతుకు ఆపద వస్తే రైతు కుటుంబాలు ధీమాగా ఉండేలా రైతు బీమాను అమలు చేసింది. ఇందులో భాగంగా ఎవరైనా రైతులు ఏ కారణంతో మరణించినా రూ. 5 లక్షల బీమా పరిహారం ఆ బాధిత కుటుంబానికి అందిస్తోంది. జీవిత బీమా కంపెనీకి రైతు బీమా పథకం ప్రీమియంగా రూ. 1,455 కోట్లు చెల్లించింది.రైతులు దళారుల చేతిలో మోసపోకుండా రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లను కట్టుదిట్టంగా నిర్వహించింది. గతంలో కంటే ఎక్కువ కొనుగోలు కేంద్రాలు నెలకొల్పింది. రైతులు నెలలకొద్దీ ఎదురు చూడకుండా డబ్బులను వేగంగా చెల్లించి రికార్డు నెలకొల్పింది. రబీ సీజన్‌కు సంబంధించి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్మిన రైతులకు కేవలం మూడు రోజుల్లోనే డబ్బులు చెల్లించింది. రాష్ట్రంలో దాదాపు 9 లక్షల మంది రైతుల నుంచి రూ.10547 కోట్ల విలువైన ధాన్యాన్ని కొనుగోలు చేసింది. వానాకాలం సీజన్ నుంచి ప్రభుత్వం రైతులకు ఇచ్చిన మాట ప్రకారం సన్న వడ్లకు రూ.500 బోనస్ ప్రకటించింది. కొనుగోలు కేంద్రాల్లో సన్న వడ్లు అమ్మిన రైతులకు బోనస్ చెల్లించింది. దీంతో రాష్ట్రంలో సన్నరకాల వరిసాగు విస్తీర్ణం పెరిగింది. రైతులకు అవసరమైన సలహాలు సూచనలు అందించేందుకు, అధికారులు నేరుగా క్షేత్రస్థాయిలో రైతులతో మాట్లాడి పరిస్థితులు తెలుసుకునేందుకు రైతు నేస్తం పథకాన్ని ప్రభుత్వం అమలు చేసింది. అన్ని రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ యూనిట్లను అమర్చనుంది. తొలి విడతగా 110 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 2601 రైతు వేదికల నుంచి రైతులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడే ఏర్పాట్లు చేసింది. అన్ని మండలాల్లో వ్యవసాయ అధికారులు ఉండేలా 148 మంది వ్యవసాయ అధికారులను నియమించారు. ఉద్యానవన శాఖలో 18 మంది హార్టికల్చర్ ఆఫీసర్లను నియమించింది. ఆయిల్ పామ్ కస్టమ్స్ సుంకంకు సంబంధించిన సమస్యలు పరిష్కరించటం ద్వారా ఆయిల్ పామ్ రైతులకు టన్నుకు 2000 అదనపు లబ్ధి చేకూరే నిర్ణయం తీసుకుంది. అశ్వారావుపేట ఆయిల్‌ఫెడ్ ఫ్యాక్టరీలో క్యాప్టివ్ పవర్ ప్లాంట్ ప్రారంభించారు.వ్యవసాయ రంగం అభివృద్ధి సలహాలు, సూచనల కోసం కోదండరెడ్డి సారథ్యంలో వ్యవసాయ కమిషన్ ఏర్పాటు చేసింది.

## ఓరి దేవుడా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో సీరియల్ కిల్లర్.. 35 ట్రైన్లలో అత్యాచారాలు



**శాసనసభ / హైదరాబాద్ :** ఓ సైకో ట్రైన్స్ లో ప్రయాణిస్తూ దేశంలోని వివిధ రాష్ట్రాల్లో వరుస హత్యలకు పాల్పడుతున్నాడు. ఇతడు తెలివిగా రైళ్లలోని లాస్ట్ భోగీలో ఉండే వికలాంగ కంపార్ట్‌మెంట్‌లోకి ఎక్కి ప్రయాణికులపై అత్యాచారం, హత్యలు, దోపిడి చేయడానికి అలవాటు పడ్డాడు.కేవలం 35 రోజుల్లో ఎక్స్‌ప్రెస్ రైళ్లల్లో తిరుగుతూ.. ఐదు రాష్ట్రాల్లో ఐదు మర్డర్లు చేశాడు. గుజరాత్‌లోని వల్సాద్ పోలీసులు సోమవారం (నవంబర్ 26) ఎట్టకేలకు ఈ సీరియస్ కిల్లర్ ను పట్టుకున్నారు. వల్సాద్ ఎస్పీ డాక్టర్ కరణ్‌రాజ్ సింగ్ వాఘేలాను నిందితుడి యొక్క వివరాలను తెలిపాడు.ఈ సీరియల్ కిల్లర్ పేరు భోలో కరమ్‌వీర్ జాట్.. హర్యానాకు చెందిన వ్యక్తి.. గతంలో రాజస్థాన్, హర్యానా, ఉత్తరప్రదేశ్‌ల్లో అనేక నేరాలకు పాల్పడ్డాడు. ఇటీవల రైల్వేలో సీరియల్ కిల్లర్‌గా మారిపోయాడు. పోలీసుల విచారణలో ఇతగాడి నేరాల చిట్టా మొత్తం బయటకు వచ్చింది. ఆదివారం ఉదయం సికింద్రాబాద్‌లోని ఓ రైలులోని వికలాంగుల పెట్టెలో మహిళ మృతదేహం తీవ్ర కలకలం రేపింది. దీంతో సికింద్రాబాద్ జీఆర్పీ అధికారులకు వల్సాద్ పోలీసులు సమాచారం అందజేయగా.. ఈ హత్య తానే చేసినట్లు కరమ్‌వీర్ ఒప్పుకున్నాడు. దీంతో నగర పోలీసులు పీటీ వారెంట్‌పై కరమ్‌వీర్‌ను హైదరాబాద్‌కి తీసుకురావడానికి ప్లాన్ చేస్తున్నారు.

## నగరంలో వరుస అగ్నిప్రమాద ఘటనలు.. నిన్న జీడిమెట్ల, నేడు మణికొండ, రామంతపూర్..



**శాసనసభ / హైదరాబాద్ :** హైదరాబాద్ లోని జీడిమెట్లలో జరిగిన అగ్ని ప్రమాద ఘటన మరువకముందే.. ఇవాళ నగరంలో మరో రెండు చోట్లు అగ్ని ప్రమాద ఘటనలు ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిం ది.ఇవాళ మణికొండ, రామంతపూర్ లో ఒక్కసారి గా మంటలు చెలరేగడంతో స్థానికంగా ఈ ఘటనలు కలకలం సృష్టించాయి. అగ్ని ప్రమాద ఘటనలతో ఫైర్ సిబ్బంది అలర్ట్ అయ్యారు. సమాచారం అందిన వెంటనే పరుగులు పెట్టి మంటలను అదుపు చేసేందుకు నానా కష్టాలు పడుతున్నారు. రెండు రోజుల నుంచి నగరంలో వరుసగా అగ్ని ప్రమాదాలు చోటుచేసు కోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. హైదరాబాద్ మణికిండలోని ఈఐపీఎల్ అపార్ట్‌మె ంట్‌లో ఎనిమిదో అంతస్తులోని 804 ఫ్లాట్‌లో రెండు రోజుల క్రితమే సంతోష్ అనే వ్యక్తి గృహప్రవేశం చేశారు. గృహప్రవేశం అనంతరం దేవుడి గదిలో దీపం పెట్టి కుటుంబ సభ్యులు నిద్రపోయారు. ఇవాళ ఉదయం తెల్లవారు జామున దీపం ఎదురుగా ఉన్న కళశానికి ఒక్కసారిగా మంటలు అంటున్నాయి. వెంటనే తేరుకున్న సంతోష్ కుటుంబ సభ్యులు ఇంట్లో వున్న గ్యాస్‌ను ఆఫ్ చేసి అపార్ట్ మెంట్ నుంచి కిందికి పరుగులు పెట్టారు. వెంటనే ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. హుటాహుటిన చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపుచేసే పనిలోపడ్డారు. కాగా.. మంటలు వ్యాపించి ఇంట్లో ఉన్న ఇంటీరియర్ డిజైనర్ పూర్తిగా కాలిపోయింది. గృహప్రవేశం చేసిన రెండు రోజులకే అగ్నిప్రమాదం జరగడంతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.మరోవైపు నగరంలోని రామంతపూర్ లోని వివేక్ నగర్ లోని ఓ ఇంట్లో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. తెల్లవారు జామున 3.30 సమయంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. మంటల తాకిడికి పార్కింగ్ లో ఉన్న మరో ఎనిమిది బైకులు దగ్ధమయ్యాయి. పార్కింగ్ లో రెండు బ్యాటరీ బైక్ లు, ఏడు ఇతర బైకులు ఉన్నట్లు సమాచారం. వెంటనే స్థానికులు మంటలను అదుపుచేశారు. సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకున్న ఉప్పల్ పోలీసులు.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బ్యాటరీ బైక్ పేలి భారీగా మంటలు వ్యాపించినట్లు అనుమానం వ్యక్తం చేశారు పోలీసులు.

## తెలుగు రాష్ట్రాల్లో పెరిగిన చలి.. 15 డిగ్రీలకు పడిపోయిన ఉష్ణోగ్రతలు.



**శాసనసభ / హైదరాబాద్ :** తెలుగు రాష్ట్రాల్లో చలితీవ్రత రోజు రోజుకు పెరుగుతుంది. దీంతో రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టాయి. కాగా.. ఆదిలాబాద్, అల్లూరి జిల్లాల్లో కనిష్ట స్థాయికి ఉష్ణోగ్రతలు పడిపోయాయి.రెండు రాష్ట్రాల్లోనూ కనిష్ట ఉష్ణోగ్రతలు 15 డిగ్రీల కంటే తక్కువగా నమోదయ్యాయి. ఇక ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వాసులను చలి వణికిస్తోంది. రోజురోజుకూ పడిపోతున్న రాత్రి ఉష్ణోగ్రతల కారణంగా జిల్లా వ్యాప్తంగా మంచు కమ్మేసింది. ఉదయం 9 గంటలకు మంచు కమ్ముకోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇక సాయంత్రం ఐదు దాటితే చాలు చలి బారి నుంచి కాపాడుకునేందుకు ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. చలికి తోడు ఈదురు గాలులు జిల్లా వాసులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.కొమురం భీం జిల్లా సిర్పూర్ యు లో 7.9 కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు కాగా.. ఆదిలాబాద్ జిల్లా అర్లిటీ లో 9.2 డిగ్రీలు గా కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇక నిర్మల్ జిల్లా పెంబి లో 10.3 డిగ్రీలుగా ఉంది. మంచిర్యాల జిల్లా తపాలపూర్ లో 12.2 గా కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉమ్మడి మెదక్ జిల్లాలో చలి తీవ్రత పెరిగింది. సంగారెడ్డి జిల్లా న్యాల్కల్ లో 9.7 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదయ్యాయి. మెదక్ జిల్లా శివ్వంపేటలో 10.2 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదు కాగా.. సిద్దిపేట జిల్లా పోతిరెడ్డిపేటలో 11.3 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదయ్యాయి. మరోవైపు హైదరాబాద్ లో చలిపంజా విసురుతోంది. దీంతో నగర వాసులు బయటకు వచ్చేందుకు వణుకుతున్నారు.

## ఎంపీగా తొలిసారి పార్లమెంటులోకి ప్రియాంక గాంధీ: ముహూర్తం ఖరారు



**శాసనసభ / హైదరాబాద్ :** వయనాడ్ లోక్‌సభ నియోజకవర్గానికి జరిగిన ఉపఎన్నికలో కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంక గాంధీ వాద్రా ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. దాదాపు 4 లక్షలకుపైగా ఓట్ల మెజార్టీతో ఆమె గెలుపొందారు.ఆమె సోదరుడు, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కంటే కూడా ఎక్కువ ఓట్లు వచ్చాయి. తొలిసారి ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేసిన ప్రియాంక.. ఈ భారీ విజయాన్ని అందుకోవడం విశేషం.కాగా, గురువారం (నవంబర్ 28)నాడు ప్రియాంక వాద్రా పార్లమెంటులో ఎంపీగా ప్రమాణం చేయనున్నారు. ఆమెతోపాటు ఎంపీలు వసంతరావు కూడా ఎంపీగా ప్రమాణం చేస్తారు. తొలిసారి ఎంపీగా ప్రమాణం చేయనున్న ప్రియాంక గాంధీ మొదటిసారి పార్లమెంటులో అడుగుపెట్టనుండటం గమనార్హం.2024 లోక్‌సభ ఎన్నికల్లో రాహుల్ గాంధీ రాయ్‌బరేలీ, వయనాడ్ నుంచి భారీ విజయం సాధించారు. అయితే, రాహుల్ రాయల్‌బరేలీ స్థానం నుంచి ఎంపీగా కొనసాగాలనుకున్నారు. ఈ క్రమంలో వయనాడ్ ఎంపీ స్థానానికిఆయన రాజీనామా చేశారు. దీంతో వయనాడ్ లోక్‌సభ నియోజకవర్గానికి ఉపఎన్నిక అనివార్యమైంది.ఈ నేపథ్యంలో వయనాడ్ ఉపఎన్నికల్లో పోటీ చేసిన ప్రియాంక గాంధీ.. ఘన విజయాన్ని సొంతం చేసుకున్నారు. గట్టిపోటీనిస్తుందనుకున్న బీజేపీ అభ్యర్థి నవ్య హరిదాస్ మూడోస్థానంలో నిలిచారు. కాగా, ప్రియాంక గాంధీ ఇంతకుముందు వరకు ఏ ఎన్నికల్లో పోటీ చేయకుండా కాంగ్రెస్ పార్టీ తరఫున ఎక్కడ ఎన్నికలు జరిగినా పార్టీ తరఫున ప్రచారం మాత్రమే చేసే చేశారు.కాగా, నవంబర్ 23న ప్రియాంక వాయనాడ్‌లో గెలిచిన తర్వాత ఓటర్లు తమకు మద్దతు ఇచ్చినందుకు తన అభినందనలను తెలియజేశారు. వారి నమ్మకానికి తాను ఎనలేని కృతజ్ఞతలు తెలుపుతున్నానని, పార్లమెంట్‌లో తమకు సమర్ధవంతంగా ప్రాతినిధ్యం వహిస్తానని హామీ ఇచ్చానని ప్రియాంకపేర్కొన్నారు. 'మీరు నాపై ఉంచిన నమ్మకానికి నేను కృతజ్ఞతతో మునిగిపోయాను" అని ప్రియాంక ఎక్స్ వేదికగా పంచుకున్నారు. వయనాడ్ ప్రజల ఆశలు, ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తానని ప్రియాంక హామీ ఇచ్చారు.

## నేడు కొమురం భీం జిల్లాలో విద్యాసంస్థల బంద్..



**శాసనసభ / హైదరాబాద్ :** కొమురం భీం జిల్లాలో నేడు విద్యాసంస్థల బంద్ కి విద్యార్థి సంఘాల పిలుపు నిచ్చాయి. వాంకిడి ఆశ్రమ పాఠశాల విద్యార్థి శైలజ మృతికి ప్రభుత్వ అధికారులే నిర్లక్ష్యం కారణమని, బంద్ కు పిలుపు నిచ్చారు.మృతి చెందిన శైలజ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, 50 లక్షల ఎక్స్ గ్రేషియ ఇవ్వాలని, వాంకిడి మండలం బంద్ తో పాటు, జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థల బంద్ కు పిలుపునిచ్చారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.అసలే ఏం జరిగిందంటే..ఫుడ్ పాయిజన్ వల్ల తీవ్ర అస్వస్థతకు గురైన 16 ఏళ్ల గిరిజన విద్యార్థిని సి.శైలజ నవంబర్ 25, సోమవారం హైదరాబాద్ నిమ్స్‌లో మృతిచెందింది. శైలజ వాంకిడి గిరిజన సంక్షేమ పాఠశాలలో విద్యార్థిని. అక్టోబర్ 31న కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని ప్రభుత్వ గిరిజన పాఠశాలలో రాత్రి భోజనం చేసి అస్వస్థతకు గురై ఆసుపత్రి పాలైన 63 మందిలో శైలజ ఒకరు. తీవ్ర అస్వస్థత కారణంగా శైలజతో పాటు మరో ఇద్దరు విద్యార్థినులు తొలుత ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అయినప్పటికీ ముగ్గురు విద్యార్థులు కోలుకోకపోవడంతో, నవంబర్ 5న నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) హైదరాబాద్‌కు తరలించారు. శైలజ ప్రైవేట్ ఆసుపత్రిలో ఉన్న సమయంలో అనేక సార్లు అతిసారంతో బాధపడింది.అయితే శైలజతో వున్న మిగతా ఇద్దరు విద్యార్థినులు కోలుకోగా.. శైలజ పరిస్థితి విషమంగానే ఉండటం కిడ్నీ సమస్యలు, ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతూ నవంబర్ 5 నుంచి నవంబర్ 9 వరకు డయాలసిస్, వెంటిలేటర్ సపోర్టుపైనే ఉండాల్సి వచ్చింది. నవంబర్ 11న, సోమవారం మరణించే వరకు ఆమెకు వెంటిలేటర్‌పై ఉంచారు. శైలజ మృతదేహాన్ని తల్లిదండ్రులు మంగళవారం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలం దాబా గ్రామంలోని స్వగ్రామంలో ఉద్రికత్తల మధ్య అంత్యక్రియలు నిర్వహించారు. అయితే శైలజ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఇవాళ విద్యార్థి సంఘాలు బంద్ కు పిలుపు నిచ్చారు. దీంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎవరిని కొమురం భీం జిల్లాలోకి అనుమతించడం లేదు. ఎక్కడ చూసి పోలీసులు భారీగా మోహరించారు.

## మారిన జీవన శైలితో చాలా మందిలో ఫ్యాటీ లివర్ సమస్య



**హైదరాబాద్ బ్యూరో, శాసనసభ :** ఇటీవలి కాలంలో ప్రతి పది మందిలో ఇద్దరు ముగ్గురికి ఎంతో కొంత ఫ్యాటీ లివర్ సమస్య ఉంటోంది. జంక్ ఫుడ్, ఫ్యాటీ ఫుడ్, వ్యాయామం లేకపోవడం వంటివి దీనికి కారణం. అయితే ఘనాహారమే కాకుండా కొన్ని రకాల పానీయాల వల్ల కూడా ఫ్యాటీ లివర్ సమస్య మరింత ముదురుతుందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఆరోగ్యకరమని భావించే పండ్ల రసాలతోనూ ఇబ్బంది ఉంటుందని చెబుతున్నారు.చాలా మంది పళ్ల రసాలు ఆరోగ్యకరమని భావిస్తూ తరచూ తీసుకుంటూ ఉంటారు. ఇందులో కొంత వరకు నిజం ఉన్నా... సమస్యలు కూడా ఉన్నాయి. చాలా వరకు జ్యూస్ ల తయారీలో విపరీతంగా చక్కెర వేస్తారు. అదే సమయంలో పళ్ల పల్ప్ ను వడగట్టేస్తారు. అంటే పండ్లలోని సహజమైన ఫైబర్ పోతుంది. ఫైబర్ లేకపోవడం, అతి చక్కెర వల్ల జీర్ణ వ్యవస్థపై, కాలేయంపై ప్రభావం పడుతుందని నిపుణులు చెబుతున్నారు. పళ్లను మొత్తంగా తింటే మంచిదని సూచిస్తున్నారు.ఫ్యాటీ లివర్ సమస్యకు ముఖ్య కారణాల్లో ఇదీ ఒకటి. ఆల్కహాల్ శరీరంలో కాలేయంలోనే విచ్ఛిన్నమవుతుంది. ఈ సందర్భంగా వెలువడే హానికర రసాయనాలు కాలేయాన్ని దెబ్బతీస్తాయి. ఫ్యాటీ లివర్ సమస్యను మరింతగా పెంచుతాయి.విభిన్న రుచుల కోసం ఉపయోగించే మాక్ టెయిల్స్, తరచూ తాగే కూల్ డ్రింక్స్ లలోనూ విపరీతంగా చక్కెర ఉంటుంది. అంతేగాకుండా వీటిలో కలిపే కొన్ని రకాల ఇతర పదార్థాలు కూడా కాలేయంపై ప్రభావాన్ని చూపుతాయి.వేగంగా శక్తిని, ఉత్సాహాన్ని ఇస్తాయని చెప్పే... ఎనర్జీ డ్రింక్స్, స్పోర్ట్స్ డ్రింక్స్ లో కొన్నింటిలో అత్యధిక స్థాయిలో కెఫీన్ ఉంటుంది. దానితో కాలేయంపై తీవ్ర ఒత్తిడి పడుతుంది. అంతేకాదు ఈ డ్రింక్స్ లో కృత్రిమ రంగులు, రుచికోసం కలిపే పదార్థాలతోనూ శరీరానికి మంచిది కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు

PMR Publication,Thurkayamjal 4-136/12, 9100900918